ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 15.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 354 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

భారత 94వ గ్రాండ్ మాస్టర్ మయాంక్ చక్రవర్తి 12

మూసి సుందరీకరణ కాదు

మూసి భూముల ఆక్రమణ పథకం

లక్షన్నరకోట్ల భూములపై రేవంత్ రెడ్డి కన్ను



- ప్రజలకు నష్టం లేకుండా సుందరీకరించవచ్చు
- బీఆర్ఎస్ హయాంలో ఆరు కిలోమీటర్లు అభివృద్ధి చేశాం
- ఒక్క ఇంటిని కూడా కూల్చకుండా నాగోల్లో అభివృద్ధి
- వేలమంది ఇల్లు కూల్చి.. మూసి ప్రణాళిక అంటే ఒప్పుకోం
- మేం మూసి పకరాజెక్టుకు వ్యతిరేకం కాదు
- ప్రాజెక్టులో జరిగే అవినీతిని అడ్డుకుంటాం
- కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పి.. పాపం కడుక్కోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- "మూసీ పునరుజ్జీవం - పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్" కార్యక్రమం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్ మార్చి 14: హిమాయత్ సాగర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ "మూసీ పునరుజ్జీవం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ₹ 16,000 కోట్లతో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఇప్పటికే ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో 6 కిలోమీటర్ల మేర విజయవంతంగా అభివృద్ధి చేశామని వివరించారు. అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్షన్నర కోట్ల రూపాయల అంచనాలతో సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ విధ్వంసానికి పాల్పడుతోందని ఆయన విమర్శించారు. ఎలాంటి డీపీఆర్ లేకుండా, సోషల్ ఇంపాక్ట్ స్టడీ, ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు, ప్రజలతో ఎలాంటి చర్చలు లేకుండా వేలమంది ఇండ్లను కూలగొడతామని కాంగ్రెస్ భయాందోళనకు గురిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చట్టాలను, నిబంధనలను అన్నింటినీ పాతర వేసి వేలకోట్ల అవినీతికి తెగబడుతున్నదని విమర్శించారు. అభివృద్ధికి మేము ఏమాత్రం వ్యతిరేకం కాదు అని, కాంగ్రెస్ పార్టీ భూదాహానికి, రేవంత్ రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు మాత్రం వ్యతిరేకమని కేటీఆర్ అన్నారు.

కచ్చితంగా రేవంత్ రెడ్డి అవినీతిని అడ్డుకుంటాం

పార్టీలకు అతీతంగా హైదరాబాద్ నగర ...:: మిగతా 2లో

వంటగ్యాస్ కు కొరత లేదు

బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక

- ఆందోళన కారణంగా బుకింగ్స్ రెట్టింపు
- కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత ఇబ్బంది
- సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కేంద్రానికి లేఖ
- గ్యాస్ సిలిండర్ల సరఫరాపై మంత్రి ఉత్తమ్ సమీక్ష
- పాల్గొన్న ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 14: రాష్ట్రంలో వంట గ్యాస్ కు ఎలాంటి ఇబ్బందులు లేవని, బ్లాక్ మార్కెట్కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అయితే ...:: మిగతా 2లో

చరిత్ర సృష్టించిన తెలంగాణ విద్యుత్ శాఖ

- విద్యుత్ వినియోగంలో ఆల్ టైమ్ రికార్డ్
- 13న ఒక్క రోజే 341 మిలియన్ యూనిట్ల సరఫరా
- విద్యుత్ సిబ్బందికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు

...:: 2లో

వసతి గృహాలను యుద్ధ ప్రాతిపదికన

పూర్తి చేయండి

- మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకు క్లియర్ చేస్తాం
- ఉపాధి హామీ కింద మెడిసినల్ ప్లాంట్స్ పెంచండి
- పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే ప్రజలు అడవిని కాపాడుతారు
- వారసత్వంగా ఉన్న ఆలయాలను అభివృద్ధి చేయండి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 14: సంక్షేమ వసతి గృహాల కోసం నిర్మిస్తున్న భవనాల్లో 80 శాతం పూర్తయిన వాటిని యుద్ధ ప్రతిపదికన రాబోయే మూడు నెలల్లో పూర్తిచేసి రానున్న విద్యా సంవత్సరంలో అందుబాటులోకి తీసుకురావాలని సంక్షేమ శాఖ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి ఆయా సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను సమీక్షించారు. తదుపరి వైద్య, ఆరోగ్య శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో ...:: మిగతా 2లో

బీఆర్ఎస్లోకి జీవన్ రెడ్డి?

- రాజీనామా యోచనలో మాజీ మంత్రి!
- కేసీఆర్ , కేటీఆర్ తో సంప్రదింపులు
- త్వరలోనే ముహూర్తం ఖరారు?
- గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ తీరుపై అసంతృప్తి
- గౌరవం, సముచిత స్థానం లేదని ఆవేదన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 14: కరుడు గట్టిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసేందుకు రెడీ అయ్యారని సమాచారం. త్వరలోనే హస్తం పార్టీకి ...:: మిగతా 2లో

రేవంత్ రెడ్డి తెలంగాణ 'చోటా యోగి'

- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్ పాలన
- కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు దగా
- కేసీఆర్ హయాంలోనే ముస్లింల సంక్షేమం
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్ మార్చి 14: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్ పాలన సాగిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్య తరహాలో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. పేదల ఇళ్లను కూల్చివేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు "చోటా యోగి"లా మారారని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ నగర్ బడా గుండులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదని, పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ నెలలో ఉపవాస దీక్ష ఆచరించడం ద్వారా పేదవాడి ఆకలి బాధ ఎలా ఉంటుందో ప్రతి ఒక్కరికీ అర్థమవుతుందని చెప్పారు. మన దగ్గర ...:: మిగతా 2లో

'పది' పరీక్షలు ప్రారంభం

- కేంద్రాల వద్ద 144 సెక్షన్
- అరగంట ముందుగానే విద్యార్థులకు అనుమతి
- రాత్రి తండ్రి మరణం.. ఉదయం కుమారుడి పరీక్ష
- విద్యాశాఖ నిర్లక్ష్యం.. 80 మంది విద్యార్థులకు అదే స్కూల్లో సెంటర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 14: రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. శనివారం నుంచి ...:: మిగతా 2లో

రోహిత్ రెడ్డి ఫాం హౌజ్‌లో కాల్పులు!

- టీడీపీ ఎంపీ పుట్ట మహేష్ అరెస్టు!
- ఈగల్ టీం, ఎస్ఓటి పోలీసులు సోదాలు
- డ్రగ్స్ పార్టీ జరిగినట్లు పోలీసుల వెల్లడి
- రోహిత్ రెడ్డి, అతడి సోదరుడితోపాటు మరో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్టుగా నిర్ధారణ
- పార్టీలలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, రాజస్తాన్ మాజీ ఎమ్మెల్యే నితీశ్ శర్మ

...:: 3లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.31 (ఆదివారం సాయంత్రం)

సహర్ – 5.01 (సోమవారం ఉదయం)

మమత సర్కార్ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

అక్రమ చొరబాటు దారులను రక్షించేందుకే తృణమూల్ కాంగ్రెస్ ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే మమతా బెనర్జీ సర్కార్ ఇలా చేస్తోందని విమర్శించారు.

7

కేజ్రీవాల్‌కు ఏటీఎంలా పంజాబ్ సర్కార్

పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. భగవంత్ మాన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, కేజ్రీవాల్‌కు ఒక ఏటీఎంలా మారిపోయిందని షా ఆరోపించారు.

7

ఎన్డీయేతో పొత్తు ప్రసక్తే లేదు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ముఖ్యంగా దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగంపైనే అందిరి దృష్టి నెలకొంది.

7

రాష్ట్రీయం

రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టుకు కేంద్రం ఒకే

- డీపీఆర్ సర్వేకు కేంద్ర ప్రభుత్వం అనుమతి
- లోక్‌సభలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 14 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరం చుట్టూ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టుకు సంబంధించి కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ కోసం సర్వే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లోక్‌సభలో రూల్ 377 కింద లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ ఈ మేరకు అధికారిక లేఖ ద్వారా ఈ వివరాలను వెల్లడించారు. రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీకి అవసరమైన సర్వేకు కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ, రీజినల్ రింగ్ రోడ్డు వెంబడి రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. డీపీఆర్ సిద్ధమైన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం , ఇతర భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరుపుతారు. అనంతరం నీతి ఆయోగ్ , కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖల ఆమోదం పొందిన తర్వాత ప్రాజెక్టుకు తుది అనుమతులు లభిస్తాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల మధ్య రవాణా వ్యవస్థ మెరుగుపడటమే కాకుండా, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి పెద్దపీట పడుతుంది. హైదరాబాద్ చుట్టూర ఉన్న నియోజకవర్గాలతో పాటుతెలంగాణా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక చొరవ చూపిన ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డికి కేంద్ర మంత్రి తన లేఖలో ధన్యవాదాలు తెలిపారు.

వంటగ్యాస్ కు కొరత లేదు

మొదటిపేజీ తరువాయి

కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్నట్లు వెల్లడించారు. శనివారంనాడు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్(ఎల్‌పీజీ) సరఫరాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 811 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.3 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 11 లక్షలు ఉజ్వల పథకం, 28 లక్షలు దీపం పథకం కింద ఉన్నాయని వెల్లడించారు.

ఆందోళన కారణంగా బుకింగ్స్ రెట్టింపు

ప్రతి నెల రాష్ట్రంలో 58 లక్షల నుంచి 60 లక్షల వరకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నఅదనంగా 7.5 లక్షల కమర్షియల్ కనెక్షన్లుని రోజులుగా ప్రజల్లో ఆందోళన కారణంగా బుకింగ్స్ రెట్టింపు అవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ సుమారు 2.5 లక్షల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా కూడా ఎక్కువగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసినట్లు మంత్రి చెప్పారు.

కమర్షియల్ సిలిండర్లపై కొంత కొరత

అయితే కమర్షియల్ సిలిండర్ల విషయంలో కొంత కొరత ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 23 వేల కమర్షియల్ సిలిండర్లు అవసరం ఉండగా ప్రస్తుతం 6,200 మాత్రమే సరఫరా చేయగలుగుతున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కమర్షియల్ సిలిండర్ల సరఫరా 20 శాతం పరిమితిలోనే జరుగుతోందని చెప్పారు.

బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు

గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ సప్లయ్ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్యాస్ సరఫరా సంబంధిత ఫిర్యాదుల కోసం 18004250033 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతో వానలు

- వాతావరణశాఖ అధికారి శ్రీనివాస్ రావు
- భద్రాచలం, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో 40 డిగ్రీలుగా నమోదు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, మార్చి 14 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. భానుడు భగభగలు మార్చిలోనే ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. "రానున్న రెండు రోజుల్లో ఎండ తీవ్రత గరిష్ఠస్థాయికి చేరడంతో పాటు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో మూడు రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని" వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. కాగా, భద్రాచలంలో అత్యధికంగా 40.2 డిగ్రీలు నమోదయ్యింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 40 డిగ్రీలుగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 36 నుంచి 40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణ స్థాయికి మించిన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుందని సీజనల్ ఫోర్‌కేస్ట్‌లో తెలిసింది. దీనికి అనుగణంగానే 3 నుంచి 4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవిలో గాలి వీచే దిశలలో మార్పు కారణంగా ఉపరితల ఆవర్తనాలు, ద్రోణులు ఏర్పడి ఉరుములు మెరుపులతో కూడిన వానలు రావడం, వాతావరణం చల్లబడటం అనేది సాధారణ పరిణామం. రానున్న రెండు రోజుల్లో ఇవే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శ్రీనివాస్ రావు తెలిపారు. ప్రస్తుతం నగరంలో 36 నుంచి 39 వరకు ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం ఉంది. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగనుందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు.

మూసి భూముల ఆక్రమణ పథకం

మొదటిపేజీ తరువాయి

ప్రజలను కాపాడుకుంటామని, కాంగ్రెస్ పార్టీ అవినీతిని ఎదుర్కొంటామని కేటీఆర్ తెలిపారు. బాధితుల వెంట కచ్చితంగా భారత రాష్ట్ర సమితి ఉంటుందని అన్నారు. ఒక రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు సమిష్టిగా కలిసికట్టుగా ప్రభుత్వం పైన పోరాడితే మా ప్రభుత్వం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ బుల్డోజర్ రాజ్యాన్ని పారదోలి ప్రతి ఒక్కరి ఇళ్లను భూములను కాపాడుతామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలకు అభివృద్ధికి డబ్బులు లేవు, విపరీతంగా అప్పులు ఉన్నాయని చెబుతున్న రేవంత్ రెడ్డి మూసి కోసం వేల కోట్లు ఖర్చు పెడతా అంటున్నారు. లక్షన్నర కోట్ల రూపాయలతో మూసిని అభివృద్ధి చేస్తామంటున్నారు. అందాల పోటీలకు ఫుట్‌బాల్ ఆటలకి వందల కోట్లు ఖర్చు పెడుతూ, మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె లెక్క రేవంత్ రెడ్డి తీరు తయారైందని అన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా నదుల నీటి వినియోగం ప్రాజెక్టుల నిర్మాణం గురించి వివరిస్తే, రేవంత్ రెడ్డి పీపీటీ ద్వారా ఎవరి ఇల్లు ఎట్లా కూలగొట్టాలి, ఎవరి భూములు ఎట్లా లాక్కోవాలి అనే విధ్వంసం గురించి వివరించారని కేటీఆర్ అన్నారు. నిజాం కట్టించిన అద్భుతమైన జంట జలాశయాలను ఖరాబ్ చేసింది కాంగ్రెస్ పార్టీనే.. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల పాలన ఫలితంగానే మూసీ సర్వనాశనం అయిందని కేటీఆర్ అన్నారు. గతంలో మూసనీని మురికి కుప్పగా మార్చిన పాపానికి ప్రజలకు క్షమాపణ చెప్పి రేవంత్ రెడ్డి పాపాన్ని కడుక్కోవాలని కేటీఆర్ అన్నారు. 'నమామి గంగే కి ఖర్చు 42 వేల కోట్లు. వందల కిలోమీటర్ల నమామి గంగే కి ఖర్చు కేవలం 42 వేల కోట్లు అయితే, 55 కిలోమీటర్ల మూసీకి లక్షన్నర కోట్లు ఎందుకు ఖర్చవుతుందనే మా ప్రశ్నకు రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి.' అని కేటీఆర్ అన్నారు. 'మూసీ అభివృద్ధిని ఏమాత్రం అడ్డుకోము. కానీ కేవలం మూసీ పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును దోచుకుంటామంటే ఖచ్చితంగా అడ్డుకుంటాము.రేవంత్ రెడ్డి వ్యవహారం చూస్తుంటే మూసీ కోసం కాకుండా, మూసీ పక్కన ఉన్న భూముల కోసం పనిచేస్తున్నాడు. రేవంత్ రెడ్డి స్వయంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే తప్పేమిటి అని అంటున్నారు. గాంధీ విగ్రహం పెడతా అంటున్న రేవంత్ రెడ్డి, గాంధీ మునిమనువడు తుషార్ గాంధీ ఆయన పేరుతో మూసీలో దోపిడీ చేయవద్దని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. కేవలం ఎవరు అడ్డుకోవద్దని మహాత్మా గాంధీ విగ్రహాన్ని రేవంత్ రెడ్డి పెట్టే కుట్ర చేస్తున్నాడు.' అని అన్నారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ తో పాటు విప్ వివేకానంద గౌడ్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ మండలి చైర్మన్ స్వామి గౌడ్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి?

మొదటిపేజీ తరువాయి

రాజీనామా చేస్తారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. అంతేకాక మార్చి 20 తర్వాత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరతారని సమాచారం. ఇప్పటికే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లతో సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. జీవన్ రెడ్డి గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ తీరుపై అసంతృప్తిగా ఉన్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలో తనకి గౌరవం, సముచిత స్థానం లేదని కొన్ని రోజుల క్రితం సన్నిహితుల వద్ద ఆయన ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం. సోషల్ మీడియా గ్రూపులకు కాంగ్రెస్ పేరు తొలగించి జీవన్ రెడ్డి పేరుతో కొనసాగిస్తున్నారు. గౌరవం లేని చోట కొనసాగాలా వద్దా అనే దానిపై ఆలోచన చేస్తున్నానని.. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటానని జీవన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆయన పార్టీకి రాజీనామా చేయబోతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్కు పార్టీ అధిష్టానం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో వివాదం మొదలైంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ (2023 అసెంబ్లీ ఎన్నికల్లో జీవన్ రెడ్డిని ఓడించిన వ్యక్తి)కు పార్టీలో, ప్రభుత్వ ప్రోటోకాల్‌లో అధిక గౌరవం ఇవ్వడం జీవన్ రెడ్డి జీర్ణించుకోలేకపోయారు. ఆయనను సంప్రదించకుండానే ఈ నిర్ణయం తీసుకోవడం ఆయన అసంతృప్తికి మూలంగా నిలిచింది. అలాగే ఇటీవల జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో జీవన్ రెడ్డి అనుచరులకు బీఫామ్‌లు ఇవ్వకుండా సంజయ్ వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం, చైర్‌పర్సన్ పదవి కూడా సంజయ్ వర్గానికి ఇవ్వడం వంటివి ఆయనను మరింత కలవరపరిచాయి. దీంతో ఆయన అనుచరులు స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ఇచ్చారు. బీఆర్ఎస్ నుంచి వచ్చినవారికి ప్రాధాన్యం ఇవ్వడం, పాత కార్యకర్తలను విస్మరించడం పట్ల కూడా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2024లోనూ సంజయ్ చేరికపై ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆలోచించారు, కానీ అధిష్టానం జోక్యంతో కొనసాగారు.

భారీ సభలో బీఆర్ఎస్ కండువా..

జీవన్ రెడ్డి త్వరలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్లో చేరే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో బలమైన ప్రచారం జరుగుతోంది. ఈ నెల 2025 మధ్యలో రాజీనామా చేసి, భారీ సభలో బీఆర్ఎస్ కండువా తీసుకోవచ్చని చెబుతున్నారు. ఆయన కేసీఆర్, కేటీఆర్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అయితే, ఆయనే ఇంకా అధికారికంగా రాజీనామా ప్రకటించలేదు. అయితే "పార్టీలో కొనసాగడం కష్టమైంది", "అవమానాలు భరించలేను" అనే వ్యాఖ్యలు జీవన్ రెడ్డి ఇటీవల చేశారు. ఇది జగిత్యాలలో కాంగ్రెస్‌కు పెద్ద షాక్‌గా మారే అవకాశం ఉంది. ఎందుకంటే ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దశాబ్దాలుగా పార్టీకి బలమైన నేతగా ఉన్నారు.

వసతి గృహాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

మొదటిపేజీ తరువాయి

సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా ఆర్థిక శాఖకు వచ్చే విధంగా ఒక సీనియర్ అధికారిని నియమించి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఈ వేసవిలో వసతి గృహాల మరమ్మత్తు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల అద్దెలు, ఎలక్ట్రికల్ బిల్లులు, కాస్మెటిక్ చార్జీలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ప్రతినెలా చెల్లిస్తామని సంక్షేమ శాఖ అధికారులు సకాలంలో ఆర్థిక శాఖకు బిల్లులు పంపాలని డిప్యూటీ సీఎం సూచించారు. గత ప్రభుత్వ కాలంలో ఈ బిల్లులు ఏడు నెలలకు ఒకసారి చెల్లించేవారని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వసతి గృహాలకు సరఫరా చేస్తున్న మెటీరియల్ క్వాలిటీ చెక్ కోసం ఒక నిర్దిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకొని నిరంతరం సమీక్షించాలని డిప్యూటీ సీఎం సూచించారు. డైట్ చార్జీలు 40 శాతం పెంచాం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచాం, సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన బిల్లులను మొదటి ప్రాధాన్యతగా గుర్తించి చెల్లిస్తున్నాం ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు నిత్యం వసతి గృహాలను సందర్శించి స్థానికంగా జరుగుతున్న బోధన, భోజనంలో నాణ్యత, సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలను పరిశీలించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రపంచం మొత్తం ఆయుర్వేదం వైపు చూస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మెడిసినల్ ప్లాంట్లు పెంచేందుకు ఆయుష్ శాఖ ఏర్పాట్లు చేసుకోవాలని అందుకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం సూచించారు. ఉపాధి హామీ పథకం లో భాగంగా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మెడిసినల్ ప్లాంట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలు అడవిని కాపాడుకుంటారని అటవీశాఖ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. పర్యాటక రంగం విస్తరిస్తే స్థానిక ప్రజలకు ఉపాధితో పాటు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. కాలుష్య కారకాలు వాటిని నియంత్రించకపోతే వచ్చే ప్రమాదాలు అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న దేవాలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని దేవాదాయ శాఖ సమావేశం లో డిప్యూటీ సీఎం సూచించారు. సమావేశాల్లో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉన్నతాధికారులు సభ్య సాచి గోష్, కృష్ణ ఆదిత్య, క్రిస్టినా, సువర్ణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం

ఏప్రిల్ 16 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, అబిడ్స్‌లో అరగంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించారు. ఎగ్జామ్ సెంటర్‌లో అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలు మొదటి రోజు కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బోర్డుపై విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్‌తో వారికి కేటాయించిన ఎగ్జామ్ హాల్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచ్‌లను అనుమతించ లేదు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొంతమంది విద్యార్థులు ఆలస్యంగా వచ్చినప్పటికీ, పరీక్ష ప్రారంభమైన తర్వాత ఐదు నిమిషాల్లోపు వచ్చిన వారికి అధికారులు అనుమతి ఇచ్చి పరీక్షకు హాజరయ్యేలా చేశారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లతో పాటు సిట్టింగ్ స్క్వాడ్లు పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేశారు. పలు జిల్లాలలో జిల్లా కలెక్టర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల కోసం కేంద్రాల్లో నీరు, విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పరీక్ష సమయంలో విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణమే చికిత్స అందించేందుకు ప్రతి కేంద్రం వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి బీఎన్ఎస్ఎస్ 163 చట్టాన్ని అమలు చేశారు. కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించి, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసుకునేలా అన్ని ఏర్పాటు చేశామని అధికారులు పేర్కొన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని జిల్లా పోలీసు యంత్రాంగం తెలిపింది. అలాగే డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 9281423623 నెంబర్ కి ఫోన్ చేయవచ్చని విద్యా శాఖ అధికారులు స్పష్టం చేశారు.

రాత్రి తండ్రి మరణం - ఉదయం కుమారుడి పరీక్ష

ఓ విద్యార్థి తండ్రి మరణాన్ని దిగమింగుకొని పుట్టెడు దుఃఖంతో శనివారం ఉదయం పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాధ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. ఆ అబ్బాయి స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియంలో 10వ తరగతి చదువుతున్నారు. శనివారం ఉదయం వార్షిక పరీక్షలు రాయాల్సింది ఉండగా, శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో తన తండ్రి కూరెళ్ల ఎల్లయ్య గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన గుండాల మండలంలోని ఎంపీపీఎస్ వస్తకొండూరులో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో నల్గొండలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించగా, పరిస్థితి తీవ్రంగా ఉందని హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లే మార్గంమధ్యలోనే ఆయన తుదిశ్వాస విడిచాడు.

విద్యాశాఖ నిర్లక్ష్యం.. 80 మంది విద్యార్థులకు అదే స్కూల్‌లో ఎగ్జామ్ సెంటర్

పదో తరగతి పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి న్యూ ఎరా స్కూల్‌లో చదువుతున్న 80 మంది విద్యార్థులకు అదే స్కూల్‌ను పరీక్షా కేంద్రంగా కేటాయించడం వివాదంగా మారింది. సాధారణంగా విద్యార్థులు తమ స్కూల్ నుంచి వివిధ కేంద్రాల్లో పరీక్షలు రాయాల్సి ఉంటుంది. కానీ న్యూ ఎరా స్కూల్ విద్యార్థులకు మాత్రం అదే స్కూల్‌లో కేంద్రం ఏర్పాటు చేయడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. ఈ విషయాన్ని బయటికి రాకుండా డీఈవో రహస్యంగా ఉంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. హాల్ టికెట్‌లను ఎవరికీ చూపించకూడదని విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఆదేశించినట్లు తెలుస్తోంది. మార్కులు పెంచుకోవడం కోసం విద్యాశాఖ అధికారులతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు కుమ్మక్కయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాంకేతిక లోపం వల్లే ఇలా జరిగిందని డీఈవో చెప్పుకొచ్చారు.

“

అభిషేక్ శర్మ, తాను ఐస్-ఫైర్‌లా ఉంటాం. మేము కలిస్తే అగ్నికి అగ్ని తోడైనట్లే. ఓపెనింగ్‌లో కొన్నిసార్లు నేను, ఇంకొన్నిసార్లు అభిషేక్ దూకుడుగా ఆడాం. 2024 నుంచి ఇదే చేస్తున్నాం. ఇంతకుముందు అభిషేక్ ఫాలోయింగ్‌ను చూసి అసూయపడేవాళ్లం. జట్టులో అతడో సూపర్ స్టార్. అతడు త్వరగా పెళ్లి చేసుకోవాలి.

- క్రికెటర్ సంజూ శాంసన్

చరిత్ర సృష్టించిన తెలంగాణ విద్యుత్ శాఖ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 14: తెలంగాణ విద్యుత్ సంస్థలు చరిత్రలో ఒకే రోజున అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు విద్యుత్ సరఫరా చేసి రికార్డు సృష్టించింది. మార్చి 13న ఉదయం 11:17 గంటలకు 18,228 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ను తట్టుకుని విజయవంతంగా సరఫరా చేసింది. మార్చి 13న తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. ఆ రోజున రాష్ట్రం 341.08 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసి, గత రికార్డు అయిన 335.19 మిలియన్ యూనిట్లను అధిగమించింది. అదే విధంగా, 18,228 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ను కూడా విజయవంతంగా తీర్చింది. ఇది గతంలో నమోదైన 17,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ (20.03.2025) కంటే ఎక్కువ. ఉష్ణోగ్రతలు పెరగడం మరియు వ్యవసాయ అవసరాలు అధికమవడం వల్ల విద్యుత్ అవసరం మరియు గరిష్టలోడ్ రెండూ పెరిగినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నాం: డిప్యూటీ సీఎం భట్టి

రాబోయే రోజుల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామని, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రోజుకు 350కు పైగా మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరమని, సుమారు 19,000 మెగావాట్ల గరిష్ట లోడ్ ను నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని అన్నారు. బలమైన విద్యుత్ గ్రిడ్ మరియు సమన్వయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికతో ఈ అవసరాలను ఎదుర్కొనే సామర్థ్యం రాష్ట్రానికి ఉందని తెలిపారు. ఈ అధిక డిమాండ్ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించినందుకు రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి అభినందించారు.

రేవంత్ రెడ్డి తెలంగాణ 'చోటా యోగి'

మొదటిపేజీ తరువాయి

ఉన్నదాంట్లో కొంత భాగాన్ని పేదలకు దానం చేస్తే అల్లాహ్ ఆశీస్సులు లభిస్తాయని అన్నారు. దేశంలో ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ సెక్యులర్ పార్టీగా నిలుస్తుందని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారికంగా ఇఫ్తార్ విందులు నిర్వహించేవారని, తెలంగాణలో ముస్లిం మైనార్టీలను ఎంతో గౌరవంగా చూసుకున్నారని పేర్కొన్నారు.కేసీఆర్ పాలనలో రంజాన్ మాసంలో ముస్లింలకు రంజాన్ తోఫా అందించేవారని, కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల్లో ఆ పథకాన్ని నిలిపివేశారని విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు దగ్గరపడుతున్నాయని స్వార్థంతో ఇప్పుడు హైదరాబాద్‌లో నామమాత్రంగా తోఫా పంచుతున్నారని అన్నారు.తెలంగాణ రాకముందు రంజాన్ నెలలో కరెంటు, తాగునీటి సమస్యలతో మైనార్టీలు ఇబ్బందులు పడేవారని, కానీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 24 గంటల విద్యుత్, ఇంటింటికీ తాగునీరు అందించి ఆ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారని చెప్పారు. ఆ ప్రేమాభిమానంతోనే గత ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు.

బీజేపీతో కలిసి పనిచేసే ప్రసక్తే లేదు

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి పొత్తులు పెట్టుకుని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను పంచుకున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు ఓడిపోయినా ఫర్వాలేదు కానీ బీజేపీతో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మైనార్టీల సంక్షేమం కోసం నాలుగు వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం రూ.2500 కోట్ల వరకు బడ్జెట్ ఖర్చు చేసి మైనార్టీ సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. మైనార్టీ విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం 204 మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసి ఉర్దూతో పాటు ఇంగ్లీష్ మీడియంలో విద్యను అందించిందని తెలిపారు. అలాగే పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాల కింద లక్ష రూపాయలు అందించారని గుర్తుచేశారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు ఆగి శాంతి నెలకొని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థించుదామని అన్నారు. అలాగే రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమం అందించిన కేసీఆర్‌కు ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- నర్మేట్టలో అత్యాధునిక పామాయిల్ ఫ్యాక్టరీ
- కేవలం 18 నెలలలోనే ఫ్యాక్టరీ పనులు పూర్తి
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభం
- పామాయిల్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 14: తెలంగాణను దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్రప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపు, ప్రోత్సాహంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగును విస్తరించి రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి దీర్ఘకాలిక భరోసా ఇచ్చే పంటగా ఆయిల్ పామ్ నిలుస్తోందని, ఒకసారి నాటితే 25 నుండి 30 సంవత్సరాలపాటు నిరంతర ఆదాయం అందించే ఈ పంట తెలంగాణ రైతులకు బంగారు భవిష్యత్తును అందించగలదని మంత్రి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట్టలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మరియు అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఫ్యాక్టరీ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులను, సిబ్బందిని అభినందించిన మంత్రి, ఈ ఫ్యాక్టరీ తెలంగాణలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త దశను తీసుకువస్తుందని పేర్కొన్నారు. అత్యాధునిక మలేషియా సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ దేశంలోనే అత్యాధునికమైన వాటిలో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. గంటకు 30 నుండి 120 టన్నుల వరకు ఆయిల్ పామ్ గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఆయిల్ పామ్ పనులు ప్రారంభించి, కేవలం 18 నెలల రికార్డు సమయంలోనే పనులు పూర్తి చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీలో క్రూడ్ పామ్ ఆయిల్, పామ్ కర్నల్ ఆయిల్ తయారీతో పాటు 4 మెగావాట్ల సామర్థ్యంతో బయో పవర్ ప్లాంట్, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానంలో పనిచేసే నీటి శుద్ధి కేంద్రం వంటి అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ గెలల నుంచి నూనె ఉత్పత్తి ప్రక్రియలో మిగిలే వ్యర్థాలను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా ఆయిల్ పామ్ రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముందు రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో మూడు రోజుల పాటు ప్రత్యేకంగా రైతుల సందర్శన కార్యక్రమం ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వద్ద వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసి ఆయిల్ పామ్ సాగు, ప్రాసెసింగ్ విధానాలపై రైతులకు వివరాలు అందించాలన్నారు. అలాగే ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా చర్చించేలా డైరెక్ట్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైతాంగం అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆయిల్ పామ్ సాగు విస్తరణతో రైతుల ఆదాయం పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

మూసీలో మురికి తీస్తామంటే అడ్డుకోవడం ఏంటీ

- బీఆర్ఎస్, బీజేపీ తీరుపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం
- హయత్‌నగర్‌లో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 14: హైదరాబాద్ మహానగరాన్నిసుందర నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో మూసీలో మురుగునీరు తీసి, మంచినీటిని పారేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నేతలు అడ్డుకోవడం ఎంటని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హయత్‌నగర్‌లో రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. విజయవాడ హైవే కోకపేట్‌కు మించి అభివృద్ధిచెందుతుందని, మూసి పునరుజ్జీవనం చేయాలని వెల్లడించారు. హయత్ నగర్, ఇబ్రహీం పట్నం, ఎల్బీనగర్ వాసులకు హైదరాబాద్ విజయవాడ రహదారి విస్తరణతో కోకాపేట లాంటి డిమాండ్ రాబోతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ సిటీగా ఫ్యూచర్ సిటీనీ నిర్మిస్తున్నామని, ఇక్కడ నుండే చెన్నై, బెంగళూరు, ముంబై పూణెను కలుపుతూ హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్, హైవే కారిడార్లు రాబోతున్నాయని అన్నారు. హయత్ నగర్ సాయిబాబా టెంపుల్ (తొర్రూర్ x రోడ్) నుంచి జీ స్కూల్ వరకు సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో 2లేన్ నుంచి 4లేన్ రహదారిగా అభివృద్ధి చేస్తున్న పనులకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. సోమవారం నుంచి పనులు మొదలు అవుతాయన్నారు.

డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుంది

అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. తాను ప్రతి రోజు హైదరాబాద్ విజయవాడ 10లేన్ల జాతీయ రహదారి విస్తరణపై సంప్రదింపులు జరపడంతో పాటు, సమీక్షలు జరుపుతున్నామని కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు రావడం కోసం కాస్త ఆలస్యం అయిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో విద్యా, ఇతర పనుల నిమిత్తం ఎక్కువ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడ్డ వారు ఎక్కువ ఉంటారన్నారు. గతంలో హైదరాబాద్ ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ రోడ్డు కోసం కృషి చేశానన్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుందని మంత్రి తెలిపారు. నాగపూర్‌లో 8 కిలోమీటర్ల తర్వాత అతిపెద్ద డబుల్ డెక్కర్ నిర్మాణం మన ప్రాంతంలో 6 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్నాం అన్నారు. సుమారు రూ.940 కోట్లతో నిర్మిస్తున్న ఈ డబుల్ డెక్కర్ కారిడార్‌లో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.200 కోట్లు చెల్లించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. త్వరలో దీనికి సంబంధించిన సమావేశాలు ఉంటాయన్నారు. ఈ డబుల్ డెక్కర్ కారిడార్‌లో పైన మెట్రో రైలు, నేషనల్ హైవే, కింద స్థానికులు వాహనాలు క్రాస్ చేసేందుకు యాక్సిడెంట్లకు ఆస్కారం లేకుండా వెహికిల్ అండర్ పాసులు ఏర్పాటు చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వచ్చే నెలలో టెండర్లు పూర్తి చేసి రహదారి విస్తరణ పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి తీసుకొని రైల్వే స్టేషన్ కలుపుతూ వేసే మరో రోడ్డు రూ. 8 కోట్ల పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు.

మూసి పునరుజ్జీవనం చేయాలి

మూసీ విషజలాలతో బాధపడుతున్న 40 లక్షల మంది బాధితుల గోస చూడండని, తమ నల్లగొండ ప్రజల ఆరోగ్యం గురించి మానవత్వంతో ఆలోచించండని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీ విష జలాలతో 30 ఏళ్లకే 60 ఏళ్ల మనుషుల లాగా మారిపోతున్నారని, ప్రజలు కిడ్నీ, క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధులతో సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ అంటేనే ఫ్లోరైడ్ జిల్లా విషపు జలాల జిల్లా అని పేరుందన్నారు. ఇక్కడి ప్రజల గోసను మానవత్వంతో అర్థం చేసుకోవాలని కోరారు. మూసి పునరుజ్జీవనం చేయాలని ఆలోచించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం భవిష్యత్ తరాలకు మేలు చేస్తుందన్నారు. దాదాపు మూడు గంటల ప్రజెంటేషన్ చూసామని, తమ నల్లగొండ ప్రజల కష్టాలు ఎలా తొలగుతాయి అనేది కళ్లకు కట్టినట్లు చూసామన్నారు.

రోహిత్ రెడ్డి ఫాం హౌజ్‌లో

కాల్పులు!

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్/మొయినాబాద్, మార్చి 14: మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో కాల్పులు జరిగినట్లు సమాచారం. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ లో ఉన్న రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ లో శనివారం డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం మేరకు ఈగల్ టీం, ఎస్ఓటి పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈగల్ టీం ఫామ్ హౌస్ లో సోదాలు నిర్వహిస్తున్న సమయంలో మూడు రౌండ్లు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ సందర్భంగా పోలీసులు టీడీపీ ఎంపీ పుట్ట మహేష్ ను పోలీసులు అరెస్టు చేశారు. గతంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు కేంద్ర బిందువుగా వార్తల్లోకెక్కిన తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్రెడ్డి ఫాంహౌస్ మరోసారి హాట్ టాపిక్గా మారింది. పార్టీలో రోహిత్ రెడ్డి, అతడి సోదరుడు రితేష్‌రెడ్డి, ఏపీలోని ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, రాజస్తాన్ మాజీ ఎమ్మెల్యే నితీశ్ శర్మ (జైపూర్) సైతం ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు. అలాగే, ఎనిమిది మంది వీఐపీలు ఉన్నట్లు సమాచారం. పోలీసులు వీరందరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వీరిలో రోహిత్ రెడ్డి, అతడి సోదరుడితోపాటు మరో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్టుగా నిర్ధారించారు. మిగిలిన వారిని పరీక్షల కోసం ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు ఈగల్ టీ అధికారులు తెలిపారు. జైపూర్ మాజీ ఎమ్మెల్యే నితీశ్ శర్మను టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ పార్టీకి తీసుకొచ్చినట్లు తెలిసింది.

ప్రజాస్వామ్య మార్గంలో సాధించే మార్పే శాశ్వతం

- మహిళలు మార్పునకు నాయకులు కావాలి
- గ్రామీణ మహిళలు ఉద్యోగ సృష్టికర్తలు కావాలి
- బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు నా జీవితం ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశాల ఫలితం
- షీస్పార్క్స్ 2026 సదస్సులో మంత్రి సీతక్క

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 14 : "బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు" సాగిన తన జీవిత ప్రయాణం ప్రజాస్వామ్య శక్తిని ప్రతిబింబిస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రజాస్వామ్య మార్గంలో సాధించే మార్పే శాశ్వతమని ఆమె అన్నారు. ఒకప్పుడు న్యాయస్థానంలో నిందితురాలిగా నిలిచిన తాను, కాలక్రమంలో అదే కోర్టులో న్యాయవాదిగా వాదనలు వినిపించిన సందర్భం తన జీవితంలో కీలక మలుపుగా నిలిచిందని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన "షీ స్పార్క్స్ 2026 (షీస్పార్క్స్ 2026)" కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శనివారం నాడు పాల్గొని ప్రసంగించారు. ఓ జాతీయ మీడియా సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీ ఐఐటీలో జరిగిన కార్యక్రమంలో తన జీవితం, మంత్రిగా తీసుకున్న కీలక నిర్ణయాలపై నిర్వాహకులు అడిగిన పలు ప్రశ్నలకు తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ముందుకు సాగుతున్న మహిళా నాయకులను ఒకే వేదికపైకి తీసుకు వచ్చిన నిర్వాహకులను ఆమె అభినందించారు. వ్యాపారవేత్తలు, పరిశోధకులు, ఐటీ నిపుణులు, రచయితలు, కళాకారులు, పరిపాలనాధికారులు వంటి అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలు ఈ సమావేశంలో పాల్గొనడం ప్రేరణనిచ్చే విషయమని అన్నారు. ఇలాంటి వేదికలు మహిళల నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆమె తెలిపారు. తన జీవిత ప్రయాణాన్ని "బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు" అని పేర్కొంటూ, ప్రజాస్వామ్యం ద్వారా సాధించే మార్పు శాశ్వతమని మంత్రి సీతక్క అన్నారు. ఒకప్పుడు న్యాయస్థానంలో నిందితురాలిగా నిలిచిన తాను, తర్వాత అదే కోర్టులో న్యాయవాదిగా నిలిచిన సందర్భం తన జీవితాన్నిమలుపు తిప్పిందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఇది సాధ్యమైందని ఆమె తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు బలపడతాయని, సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క అన్నారు. దేశ అభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములు మాత్రమే కాకుండా మార్పుకు నాయకత్వం వహించే స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం నిర్వహించిన యువర్ స్టోరీ సంస్థ స్థాపకురాలు శ్రద్ధా శర్మ, నిర్వాహకులను మంత్రి సీతక్క అభినందించారు. మహిళలు అభివృద్ధిలో భాగస్వాములు మాత్రమే కాకుండా మార్పుకు నాయకులుగా నిలిచే భవిష్యత్తును కలిసి నిర్మిద్దామని ఆమె పిలుపునిచ్చారు.



'డిజిటల్ ఎకానమీ'గా మారేందుకు సహకరిస్తాం

- కీలక రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామిగా 'తెలంగాణ'
- ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటు సాధ్యసాధ్యాలపై అధ్యయనం
- టాంజానియా ఉన్నత స్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 14: డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, మహిళా సాధికారత, ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలప్ మెంట్ తదితర కీలక రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను సిద్ధం చేస్తామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాంజానియా మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ ముద్రిక్ రమదాని సోరాగా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యింది. 'తెలంగాణ - టాంజానియా' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సామాజిక, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి బలమైన పునాదిగా మారిందన్నారు. ఆ దిశగా తెలంగాణ వేసిన అడుగులు ప్రపంచ పటంలో మన రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ ను క్రియేట్ చేశాయన్నారు. ఇదే స్ఫూర్తితో డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారం, మెంటార్ షిప్, నైపుణ్య మార్పిడి అందిస్తామన్నారు. అక్కడ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు గల సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. 'మీ సేవ' ద్వారా డోర్ స్టెప్ సిటిజన్ సర్వీసెస్ డెలివరీ, 'వీ హబ్' మార్గ నిర్దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం తదితర అంశాల్లో ఒక 'నాలెడ్జ్ పార్ట్నర్'గా వ్యవహరిస్తామన్నారు. 'డిజిటల్ ఎకానమీగా మారాలన్న మా లక్ష్య సాధనలో తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఆవశ్యకం. ఐటీ, హెల్త్ కేర్, మెడికల్ టూరిజం, డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో సాధించిన ప్రగతి, చేపట్టిన సంస్కరణలు మాకు స్ఫూర్తిదాయకం. అందుకే... తెలంగాణతో కలిసి పని చేసేందుకు త్వరలోనే ఎంవోయూ కుదుర్చుకుంటాం' అని టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టాంజానియా కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ఫాత్మా ముబ్రాక్ ఖమిస్, జాంజిబార్ ఐసీటీ అథారిటీ సీఈవో శుకూరు అవాద్ సులేమాన్, ప్రెసిడెంట్స్ డెలివరీ బ్యూరో - హెడ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్ మెంట్స్ జాన్ మహుండి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ అంతరాయం ఉండొద్దు

- విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరిక
- తాగు, సాగునీటికి విద్యుత్ సరఫరా నిరంతరం ఉండాలని ఆదేశం

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 14: వేసవి కాలంలో ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ విద్యుత్ శాఖ అధికారులకు గట్టి సూచనలు చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో డిఈ శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సరఫరా లోపాలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సమీక్ష సమావేశానికి హాజరైన నూతన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్‌లను విద్యుత్ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, ముదిరాజ్ సంఘం నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, గూడ వీరేశం, హరినాథ్ రెడ్డి, కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, నేతలు రఘు నాయక్, జమ్రుత్ ఖాన్, నర్సింహులు, ఆంజనేయులు, డిఈ శ్యాంసుందర్ రెడ్డి సహా విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలో జరిగిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుమారుడు సాయి సాకేత్ రెడ్డి-ఐశ్వర్య వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకకు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

- ప్రతిపక్షం, గద్వాల్

దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే ఒప్పందాలను

పునఃపరిశీలించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత

- రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 14: దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే ఏ ఒప్పందాన్నైనా పునఃపరిశీలించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. భారతదేశ స్వావలంబన, రైతులు, కార్మికులు, సాధారణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇండో అమెరికా ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలోని ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన నిరసన దీక్షలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలు, ప్రజల హక్కులు కాపాడే విషయంలో యువత ముందుండి పోరాడటం అభినందనీయమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం ప్రతి పౌరుడి హక్కు అని ఆమె తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రప్పా రప్పా అంటే వైసీపీకి ఇప్పుడున్న సీట్లు కూడా రావు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం ఖాయం. తిరుమల లడ్డూలో కెమికల్స్ కలిపిన దుర్మార్గపు పార్టీ వైసీపీ. హిందూ మతాన్ని నాశనం చేయడమే వైసీపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఓడిపోయినా ఆ పార్టీకి బుద్ధి రాలేదు.

- జనసేన ఎమ్మెల్సీ నాగబాబు

ఓపెన్ వాయిస్

శత్రువుకు శత్రువు.. మిత్రుడు

ప్రస్తుతం భారత రాజకీయాల్లో 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే సూత్రం విపక్షాల ఐక్యతకు దిక్సూచిగా మారింది. ఇండీ కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ, లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం మరియు సీఈసీపై అభిశంసన తీర్మానం వంటి అంశాలు విపక్షాలను ఏకం చేయడానికి రాజకీయ అస్త్రాలుగా దొరికాయి. ఇవి కేవలం తీర్మానాలు మాత్రమే కావు, విపక్షాల ఐక్యతకు ఒక 'లిట్మస్ టెస్ట్' వంటివి. సంఖ్యాబలం లేకపోయినా ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో నెట్టగలమనే ఆత్మవిశ్వాసాన్ని ఇవి విపక్షాల్లో నింపాయి. అయితే, ఢిల్లీ స్థాయిలో కనిపిస్తున్న ఈ ఐక్యత రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి మాయమవుతోంది. బెంగాల్‌లో మమత వర్సెస్ కాంగ్రెస్‌లెఫ్ట్, కేరళలో ఎల్డీఎఫ్ వర్సెస్ యూడీఎఫ్ పోరు విపక్షాల ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది. సీట్ల సర్దుబాటు, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు ఈ కూటమికి పెను సవాలుగా మారాయి. తమిళనాడు, మహారాష్ట్రలో పొత్తులు బలంగా ఉన్నప్పటికీ, పంజాబ్, కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో విపక్షాల మధ్య 'పగటి పూట స్నేహం రాత్రి పూట యుద్ధం' అనే చందంగా రాజకీయాలు సాగుతున్నాయి.శత్రువుకు శత్రువు మిత్రుడు అవుతారంటారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు ఈ సమీకరణంతోనే నడుస్తున్నాయి. ముఖ్యంగా విపక్ష కూటమి. పైకి చూస్తే ఎవరికి వారే అన్నట్టుగా కనిపిస్తున్నా.. రాజకీయ శత్రువు కళ్ల ముందు కనిపించే సరికి.. ఏకం అవ్వాలనే కసి పెరుగుతోంది. నిజానికి, విపక్షాలకీ కలవాలనుంది. కలవడానికి బలమైన కారణాలూ ఉన్నాయ్. ఇండీ కూటమి విచ్చిన్నమైనా విపక్షాల్ని ఏకం చేయడానికి అస్త్రాలు వరుసగా దొరుకుతున్నాయ్. అందులో మొదటిది లోక్‌సభ స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం. అఫ్‌కోర్స్ ఆ తీర్మానం వీగిపోయింది. నిజానికీ ఈ తీర్మానం వీగిపోతుందని విపక్షానికి కూడా తెలుసు. కాకపోతే.. అందులో ఓ రాజకీయ వ్యూహం ఉంది. ఇండీ కూటమి ఐక్యతకు అదో లిట్మస్ టెస్ట్ లాంటింది. ఈ తీర్మానం విపక్షాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, వారిని ఒకే తాటిపైకి తెచ్చింది. ఎలా చెప్పగలరు అలా అంటే.. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు కలిసి ఉమ్మడిగా నోటీసు ఇచ్చాయి. తీర్మానంపై చర్చ జరిగినప్పుడు కూడా ఒక్కటిగానే నిలబడ్డాయి. ఓటింగ్ సమయంలో కలిసే ఉండాలని మాట్లాడుకున్నాయి. ఓవరాల్‌గా.. సీట్ల సర్దుబాటులో సమస్యలు ఉన్నప్పటికీ.. బీజేపీ వ్యతిరేక పోరాటంలో తామంతా ఒక్కటేననే సంకేతాన్ని ప్రజల్లోకి పంపాయి విపక్షాలు.అటు బెంగాల్ లో మాత్రం పశ్చిమ బెంగాల్ లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తమ ఉనికిని చాటుకోవడంతో పాటు మమతా బెనర్జీని గద్దె దించడమే పరమావధిగా ముందుకు సాగుతున్నాయి. .మమతా బెనర్జీకి అండగా నిలిచే మైనారిటీ , గ్రామీణ ఓటు బ్యాంకును దెబ్బతీయడం ఈ కూటమి ప్రధాన ఉద్దేశం. గతంలో కాంగ్రెస్‌కు పట్టున్న మాల్దా, ముర్షిదాబాద్ వంటి జిల్లాల్లో టీఎంసీని అడ్డుకుంటే, రాష్ట్రస్థాయిలో మమతా ప్రాభవం తగ్గుతుందని వీరి అంచనా. మమతా బెనర్జీకి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఓటు తమకే పడాలని, తద్వారా టీఎంసీని బలహీనపరిచి మళ్లీ రాష్ట్రంలో తాము ఒక నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని లెఫ్ట్‌కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ టాస్క్ లో భాగంగానే వీరు సంయుక్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తూ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు.టీఎంసీకి వ్యతిరేకంగా నిరంతరం వీధుల్లో పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ వంటి యువజన సంఘాలను లెఫ్ట్ కూటమి ముందు వరుసలో నిలుపుతోంది. మరో వైపు ఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నోటీసులో విపక్షాలు ఏడు ప్రధాన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని, అనుచిత ప్రవర్తన రుజువైందని, ఎన్నికల అవకతవకలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, సామూహికంగా ఓటుహక్కును రద్దుచేశారని విపక్షాలు ఆరోపించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తున్నారని ఆరోపించాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే సీఈసీని తొలగించాల్సి ఉంటుంది. ఇందుకు లోక్‌సభలో 100 మంది, రాజ్యసభలో 50 మంది సంతకాలు అవసరం. స్పీకర్ నోటీసును అంగీకరిస్తే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఈ ఆరోపణలను పరిశీలిస్తుంది. ఆరోపణలు నిజమని తేలితే తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఉభయసభల్లోనూ హాజరైన ఎంపీల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ లభిస్తే తీర్మానం నెగ్గుతుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
15.03.2026

బహుజన స్వరాజ్య సిద్ధాంతకర్త కాన్షీరాం

సంపతి రమేష్
7989579428

భారతదేశ సామాజికరాజకీయ చరిత్రను వెనక్కి తిప్పి చూస్తే ఒక స్పష్టమైన నిజం కనిపిస్తుంది. ఈ దేశం మెజార్టీ అట్టడుగు అణగారిన వర్గాల కష్టంతో నిర్మితమైనా, అధికారాన్ని మాత్రం శతాబ్దాలుగా ఆధిపత్య కులాల చేతుల్లో కేంద్రీకృతమైనవి. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, బహుజన రాజకీయాల కోసం గళమెత్తిన విప్లవ వీరుడు మాన్యవర్ కాన్సిరాం.ఆయన మార్చి 15, 1934 పంజాబ్ రాష్ట్రంలో రోపార్ జిల్లా, కావాస్పూర్ గ్రామంలోనీ చమార్ కులంలో జన్మించాడు. జ్యోతీరావ్ పూలే, ఛత్రపతి సాహు మహరాజ్, పెరియార్, నారాయణ గురు, అంబేద్కర్ ల ప్రబోధాలతో పేదల రాజ్యం కోసం బయలుదేరిన యోధుడు. అంబేద్కర్ రచించిన "కుల నిర్మూలన" గ్రంథం ద్వారా ప్రేరణ పొంది, రాజకీయ యుద్ధమే బహుజన విముక్తికి మార్గమని నమ్మాడు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీల ఐక్యతే బహుజన రాజ్యాధికారానికి మార్గమని విశ్వసించి బామ్ సేఫ్, DS4 వంటి సంస్థలను నిర్మించాడు. 1984 ఏప్రిల్ 14న బహుజన సమాజ్ పార్టీని స్థాపించాడు. ఇదీ 1996 నాటికి జాతీయ పార్టీగా ఎదిగి బహుజన రాజ్యానికి దిక్సూచిగా నిలిచింది. దళిత మహిళ మాయావతినీ నాలుగుసార్లు ముఖ్యమంత్రినీ కావడానికి కారకులయ్యారు. కాన్సిరాం అవిశ్రాంత రాజకీయ పోరాటం 2006 అక్టోబరు 9న ఆగిపోయినది. కాన్షిరాం మన నుంచి దూరమై రెండు దశాబ్దాలు కావస్తున్నా ఆయన స్వరాజ్య పోరాటం అనేక రూపాల్లో కొనసాగుతుంది. ఇటీవల దేశ వ్యాప్తంగా వినబడుతున్న కుల గణన, రిజర్వేషన్లు పెంపు వంటి సామాజిక న్యాయ డిమాండ్లు ఇందుకు నిదర్శనం.



మరోవైపు తెలంగాణలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలకు భూమి, సంపద, అధికారంలో వాటా కోసం"మా భూమి" పేరుతో డాక్టర్ విశారదన్ మహరాజ్ మహాగర్జన కొనసాగుతుంది. ఈ క్రమంలో నేడు కాన్షీరామ్ రాజ్యాధికార పోరాటం సమీక్షించుకోవాల్సిన సందర్భం ఇదీ.

దేశ రాజకీయాల్లో ప్రకంపనలు

కాన్సిరాం కులాన్ని నిర్మూలిద్దాంబహుజన రాజ్యాన్ని నిర్మిద్దాం అంటూ దేశ రాజకీయాల్లో సరికొత్త నినాదానికి తెరలేపాడు. నువ్వు 85 శాతం ఉండగా 15 శాతం మీద ఎందుకు ఆధారపడతావు? అని ప్రశ్నించి స్వాభీమానన్నీ నేర్పిన యోధుడు. ఓటు హమారా-రాజ్ తుమారా, నహీ చలేగా.. నహీచలేగా"(ఓట్లు మావి-రాజ్యం మీది, ఇకపై చెల్లదు, ఇకపై చెల్లదు) మరియు జిస్కి జితనీ సంఖ్యా భారి, ఉన్కి ఉత్నీ ఇస్సేదారి (ఎవరెంతో, వారికంతా) వంటి నినాదాలతో దేశ రాజకీయాల్లో ప్రకంపలను సృష్టించాడు. స్వాతంత్రానంతరం రాజ్యాంగం అమల్లోకి వచ్చాక అటు దేశంలో, ఇటు రాష్ట్రాల్లోనూ అగ్రకుల ఆధిపత్య రైటిస్ట్, లెఫ్టిస్ట్ పార్టీలే అధికారంలో ఉండేవి. 1975 ఎమర్జెన్సీ తరువాత కూడా ఆ పార్టీలే అధికారంలోకి రావడం గమనార్హం. వీటికి అభిముఖంగా కాన్షిరాం బహుజన ఉద్యమం బయలుదేరింది. ములాయం సింగ్ యాదవ్ 1992 కి ముందు జనతా దళ్(సోషలిస్ట్) నుంచి ముఖ్యమంత్రి అయ్యాడు. కాన్సిరాం ఆయనను ఆ పార్టీ నుంచి బయటికి రప్పించి సొంత రాజకీయ పార్టీనీ పెట్టించాడు. ఆ పార్టీ పొత్తుతో 1993లో యూపీలో బహుజన రాజ్యాధికారం చేజిక్కిచ్చుకున్నాడు. కాన్సిరాం బహుజనోద్యమం పంజాబ్, రాజస్తాన్, కర్ణాటక, హర్యానా, ఢిల్లీ,కాశ్మీర్, బీహార్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపింది. ఆయన రాజకీయ చైతన్య పోరాటం వెనుకబడిన కులాల్లో రాజకీయ కాంక్షను రగిలించింది. బారతదేశ కుల వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించింది. యూపీలో ములాయం సింగ్ యాదవ్, బీహార్ లో లాలూ ప్రసాద్ యాదవ్, రామ్ విలాస్ పాశ్వాన్, నితీష్ కుమార్ మొదలైనవారు తమ సొంత రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకోగలిగారు. రాజకీయంగా అస్తిత్వాన్ని చాటుతున్నారు. దక్షిణాన తమిళనాట ఆత్మగౌరవ రాజకీయాలు, తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీల జాక్ వేదికగా డాక్టర్ విశారదన్ మహారాజ్ స్వధర్మ, స్వరాజ్య పోరాటం ఇందుకు నిదర్శనమే.

అనేక రంగాల్లో మార్క్స్, ఎంగెల్సులు చేసిన పొరపాట్లతో

కోట్లాది ప్రజలు జీవితాలు కోల్పోయారు

రష్యా చైనా విప్లవాలు పెటీ బూర్జువా నాయకత్వంలో సాగిన జాతీయ విప్లవాలు. వారి భౌతిక అవసరాలను అనుసరించి విప్లవాలు చేసారు. అందుకు కార్మిక వర్గాన్ని కలుపుకున్నారు. రైతాంగాన్ని చైతన్య పరిచారు. అందుబాటులో వున్న మార్క్స్ ఎంగెల్సుల సిద్దాంతాలను ఆసరా చేసుకున్నారు. అవి జాతీయ విప్లవాలు తప్ప సోషలిస్టు విప్లవాలు కావు. భారతదేశ పరిస్థితులు వేరు. రష్యా పరిస్థితులు వేరు. చైనా పరిస్థితులు వేరు. రష్యాలో కొంతకాలం పార్లమెంట్ లో ఉన్నారు. ఆ తర్వాత దానిని వదిలేశారు. మావోకు పార్లమెంట్ లో ఉండే అవకాశం రాలేదు. ఆయన లాంగ్ మార్చ్ చేయించాడు. గాంధీజీ దండి ఉప్ప సత్యాగ్రహం చేపట్టాడు.



బి ఎస్ రాములు
8331966987

తాత్విక రంగంలో, చారిత్రక రంగంలో , రాజకీయ ఆర్థిక రంగాల్లో మార్క్స్ , ఎంగెల్సులు అనేక పొరపాట్లు చేసారు. స్వీయ పరిశోధనలు చేయకుండా ఇతరుల పరిశోధనలపై, ఇతరుల ఆలోచనలపై ఆధారపడి అనుకూల వ్యతిరేక చర్చలు , విశ్లేషణలు , తీర్మానాలు చేసారు. కార్యక్రమాలు రూపొందించారు. ఇదొక డిపెండెంట్ సైకాలజీ. మరో మాటలో చెప్పాలంటే సెకండ్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్ పై ఆధారపడి నిర్ణయాలు చేసారు. కార్యక్రమాలు రూపొందించారు. పుస్తకాల ద్వారా అందే జ్ఞానమంతా పరోక్ష జ్ఞానమే తప్ప ప్రత్యక్ష జ్ఞానం కాదు. ప్రత్యక్ష జ్ఞానంపై పరోక్ష జ్ఞానంతో , వాదనతో జయించడం అంటే సంపద సృష్టికర్తలపై వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ ఆధిక్యతావాదులు ఆధిపత్యం చెలాయించి వారిని దోచుకొని అణిచివేయడానికి వాదాలు, సిద్ధాంతాల వంటివి తప్ప వేరు కాదు. మార్క్స్ ఎంగెల్సులు ఈ పనిలో కొత్త పదజాలంతో కొత్త భావాలతో విజయం సాధించారు. అవన్నీ అలా ఉంచి ప్రస్తుతం ప్యారిస్ కమ్యూన్ కు పరిమితమవుతాను.

ఫ్రాన్సు విప్లవం- ప్యారిస్ కమ్యూన్ ఏర్పాటు- స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం

ఫ్రాన్సు విప్లవం విషయంలో మార్క్స్ , ఎంగెల్సులు ఒక పొరపాటు చేశారు.. ఫ్రాన్స్‌లో 1871లో ఒక పెద్ద విప్లవం జరిగింది. ప్యారిస్ కమ్యూన్ పరిపాలనగా అది ప్రాచుర్యంలోకి వచ్చింది. రాజరికాన్ని, రాజును కూల దోసి ప్రజలు అధికారం చేపట్టారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నినాదాలు వారు రూపొందించినవే. ఆ నినాదాలతో గొప్ప ఉద్యమం జరిగింది. దానితోటి అక్కడి ఫ్రెంచి సోషలిస్టులు అధికారంలోకి వచ్చారు . 72 రోజులు పరిపాలన సాగించారు. బ్లాంకిస్టులు అధికారంలోకి వచ్చిన తర్వాత రాజరికానికి అనుకూలంగా ఉన్నటువంటి సైన్యాధికారులు ఈ 72 రోజుల విప్లవ ప్రభుత్వాన్ని పడగొట్టినారు. అందరిని చంపేసారు.

ఫ్రెంచి విప్లవం వేరు- మార్క్సిజం కమ్యూనిజం వేరు

అసలు అలా విప్లవమే చేయాల్సింది కాదు' , ఆ సమయం ఇంకా ఆసన్నం కాలేదు. అన్నట్టువంటి మార్క్స్, ఎంగెల్స్ లు వారందరూ చనిపోయిన తర్వాత 'ఒక గొప్ప విప్లవం అని ప్రకటిస్తూ 'దాని గుణపాఠాలు' అనే పేరు మీద 'మనకు కూడా సొంత సైన్యం ఉండాలి. విప్లవోద్యమం సొంత సైన్యాన్ని తయారుచేసుకోవాలి అని సూత్రీకరించారు'. కార్మిక వర్గ విప్లవంలో సొంత సైన్యం ఉండాలనే భావన అలా వెల్లూనుకున్నది. అది ఎన్నో తప్పులకు రక్తపాతాలకు లక్షలాది ప్రజలు ఇరువైపులా చనిపోవడానికి కారణమైంది. వారు నిజానికి అది ఆవేశపూరితంగా చేశారో?మరేమిటో తెలియదు . కాని అక్కడ ఫ్రెంచ్ సోషలిస్ట్ ఉద్యమాలు చేస్తున్న వారు ప్రజాస్వామ్య వాదులు.! వారు సోషలిస్ట్‌లు.! వారు కమ్యూనిష్టులు కాదు. కమ్యూనిష్టులు ఏక పార్టీ నియంతృత్వ వాదులు. సోషలిస్టులు వేరు. వారు ప్రజాస్వామ్య బహుళ పార్టీ వ్యవస్థలో కలిసి పని చేద్దాం అన్న సోషలిస్టులు. అది మార్క్స్ ఎంగెల్సులు నడిపిన విప్లవం కాదు. అది నడిపిన సోషలిస్టులు వేరే. మార్క్స్, ఎంగెల్స్ లు వారిని విభేదించి ఏక పార్టీ వ్యవస్థను ప్రతిపాదించారు. ఆ తర్వాత ఇప్పుడు సాయుధ పోరాటం అన్నారు.

భారత దేశం నుండి తీసుకున్న గుణ పాఠాలు ఎందుకు వదిలేసారు?

మరి మార్క్స్, ఎంగెల్స్ లే భారతదేశంలో 1857 లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటం బహదూర్ షా నాయకత్వంలో అందరూ రాజులు, సంస్థానాధీశులు బ్రిటీష్... ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేసినప్పుడు 'ఇది గొప్ప స్వాతంత్ర్య పోరాటం' ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం అని పుస్తకం రాశారు. లండన్ లైబ్రరీలో ఉన్న పుస్తకాలు పత్రికలుఅన్ని చదివేసి ఎక్కడెక్కడ ఈస్టిండియా కంపెనీ రత సైనికులు తిరుగుబాటు చేశారో రాశారు. ఈస్టిండియా కంపెనీ లోని భారతీయ సైనికులు తిరుగుబాటు చేసిప్రథమ భారతస్వాతంత్య పోరాటంలో పాల్గొన్నారు. ఆ విషయం నమోదు చేసారు. ఫ్రాన్సు విప్లవ గుణ పాఠాల్లో ఇండియాలో వలె సైనికులను మనవైపు తిప్పుకోవాలి అని మార్క్స్ , ఎంగెల్సులుచెప్ప వచ్చు కద! అలా చెప్ప లేదు. అలా ఎందుకు చెప్ప లేదు అనేది ముఖ్యమైన ప్రశ్న. ఇండియాలో సైనికులు పాలకులకు వ్యతిరేకంగా ఎలా తిరుగుబాటు చేశారో అక్కడ కూడా ప్రభుత్వంలో ఉండే సైన్యంలోతిరుగుబాటు లేవదీయాలి. మనలో ఇట్లా కలుపుకోవాలి' అని రాసి ఉంటే సరిపోయి ఉండేది. అట్లా రాయకుండా సొంత సైన్యాన్ని తయారు చేసుకోమన్నారు. దానివల్ల ఇప్పటిదాకా 150 సంవత్సరాలుగా ఎన్ని నష్టాలు జరిగాయో మనందరికి తెలుసు. ఆ చరిత్ర అలా వుంచుదాం. ఇలాంటి సవా లక్ష పొరపాట్లు చేశారు సొంత సాయుధ సైన్యం ఏర్పాటు చేసుకోవాలి అనే ఒకే తీర్మానం సవా లక్ష తప్పుల కన్నా పెద్ద పొరపాటు చేసారు మార్క్స్ , ఎంగెల్సులు. అదలా నుంచి ఇండియా విషయానికి వద్దాం.

రష్యా చైనాలతో మనకేం పోలిక?

రష్యా చైనా విప్లవాలు పెటీ బూర్జువా నాయకత్వంలో సాగిన జాతీయ విప్లవాలు. వారి భౌతిక అవసరాలను అనుసరించి విప్లవాలు చేసారు. అందుకు కార్మిక వర్గాన్ని కలుపుకున్నారు. రైతాంగాన్ని చైతన్య పరిచారు. అందుబాటులో వున్న మార్క్స్ ఎంగెల్సుల సిద్దాంతాలను ఆసరా చేసుకున్నారు. అవి జాతీయ విప్లవాలు తప్ప సోషలిస్టు విప్లవాలు కావు.

భారతదేశ పరిస్థితులు వేరు. రష్యా పరిస్థితులు వేరు. చైనా పరిస్థితులు వేరు. రష్యాలో కొంతకాలం పార్లమెంట్ లో ఉన్నారు. ఆ తర్వాత దానిని వదిలేశారు. మావోకు పార్లమెంట్ లో ఉండే అవకాశం రాలేదు. ఆయన లాంగ్ మార్చ్ చేయించాడు. గాంధీజీ దండి ఉప్పు సత్యాగ్రహం చేపట్టాడు. మనదేశంలో లాంగ్ మార్చ్ కి బదులుగా 1929 లోనే స్వాతంత్ర్యం వస్తుంది అని చెప్పి గాంధీ ప్రకటించాడు. కాని ప్రపంచ యుద్ధాల వల్ల ఆలస్యంగా స్వాతంత్ర్యం వచ్చింది. మనదగ్గర బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాట్లు జరిగాయి. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా చారు మజుందార్, నక్సలైట్స్ ఎవరు లేకముందే 169 తిరుగుబాట్లు చేశారు. వెన్నెకంటి రాఘవయ్య గారు దాని మీద పెద్ద పుస్తకం రాశారు. అట్లాంటి 169 పోరాటాలు ప్రజలకు అవసరం. ఆదివాసుల యొక్క అవసరం.

దరఖాస్తు విజ్ఞాపన యొక్క ప్రాధాన్యత ఇపుడు మనకు తెలుసు

అట్లా చేసిన పోరాటాలు ఉండగా భారత ప్రథమ స్వతంత్ర పోరాటం జరిగిన తర్వాత మనం దీనిని ఆదర్శంగా తీసుకోలేదు. బ్రిటీష్ ప్రభుత్వం మొదటి నుంచి ఒక పని చేస్తూ వస్తున్నది. జర్మనీలో గాని, ఫ్రాన్స్‌లో గాని యుద్ధాలు జరిగితే అంతర్గత సంఘర్షణలు జరిగితే దాని నుంచి గుణపాఠాలు తీసుకొని తనకుతాను ఎప్పటికప్పుడు సంస్కరణలు పెట్టుకొని సమాజాన్ని సంస్కరించే సంస్కరణలు పెట్టుకుంటుంది.



ఫ్రాన్స్ లో తిరుగుబాట్లు జలగగానే , అంతకు ముందే ఇండియా లో తిరుగుబాటు జరగడం వల్ల సర్ రాబర్ట్ హ్యూమన్ కాంగ్రెస్ పార్టీని 1883 లో ప్రారంభించాడు. ఏదైనా కష్టం వుంటే చెప్పు కొనండి. దరఖాస్తు ఇవ్వండి అని సామరస్య పద్ధతిని ప్రవేశ పెట్టాడు. మార్క్స్ ఇలాంటి సూచనలు చేయలేక పోయాడు. ప్రభుత్వాల మీదకు సైన్యంతో దండెత్తాలన్నాడు. యుద్ధాలు చేయడానికి సిద్దాంతాలెందుకు? తరతరాలుగా శతాబ్దాలుగా యుద్ధాలు చేస్తేనే వున్నారు. మార్క్స్ , ఎంగెల్సులు కొత్తగా చెప్పిందేముంది? మీకేమైనా సమస్యలు ఉంటే దరఖాస్తు ఇవ్వండి. దరఖాస్తు అనేది ప్రజాస్వామ్యంలో మొట్టమొదటి ప్రాథమికమైన ప్రధానమైన ఇష్యూ. ప్రజాస్వామ్యం అంటేనే దరఖాస్తు ఇవ్వడం. ఆ దరఖాస్తు ద్వారా సమస్య పరిష్కారం అవుతుందో? లేదో? చెప్పాలి. దరఖాస్తు అంటేనే ప్రజాస్వామ్యం. లేకపోతే ప్రజాస్వామ్యం లేదు. అలాంటి విధానాన్ని ఇండియాలో ఆంగ్లేయ ప్రభుత్వం ఆమోదించింది. అలా అనేక సంస్కరణలు చేసుకుంటూ వచ్చారు. పరిపాలనలో భాగస్వాములను చేశారు. మహాత్మా జ్యోతి గాను పూలే పూనా మున్సిపాలిటీ సభ్యులుగా మద్య నిషేదం గురించి బాలికల విద్య గురించి సూచనలు చేసారు. బ్రిటిష్ ప్రభుత్వం పూలేను సన్మానించింది. రష్యా చైనాలో ఈ శాంతియుత పరిణామం సాగలేదు . జాతీయోద్యమంలో గోఖలే, లాలా లజపతి రాయ్, తిలక్, గాంధీ , నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ , జిన్నా నాయకత్వం వహించారు.. సుభాష్ చంద్ర బోసు కాంగ్రెస్ అధ్యక్షుడైనాడు. ఆజాద్ ాబర్ట్ ఫౌజ్ ఏర్పరచాడు. జిన్నా, అంబేద్కర్, లోహియా ఉన్నారు. కమ్యూనిస్ట్ పార్టీలు, సోషలిస్ట్ పార్టీలు ఉన్నాయి. ఇన్ని రకాల ఉద్యమాలు జరుగుతున్నాయి. ఇవి మన దేశ పరిస్థితులు. 1919 నాటికే భారత రాజ్యాంగ చట్టాలను రూపొందిస్తూ వచ్చారు. 1935 లో రాసిన రాజ్యాంగమా ప్రాతిపదికగా 1950 రాజ్యాంగం రూపొందింది. ఇలా క్రమ క్రమంగా పరిపాలనలో భాగస్వామ్యం చేస్తూ పూర్తిగా భారతీయులకే అప్పగించి వైదొలిగారు. రష్యా చైనాలకు ఇలాంటి అవకాశాలు రాలేదు. వారి పరిస్థితులు పోరాటాలు వేరు. సరే అది అలా వుంచి ప్రస్తుతంలోకి వస్తాను.

పార్టీలో వున్నవారికన్నా వెల్లి పోయినవారా ఎక్కువ.

పార్టీలో వున్న వారికన్నా విభేదించి వెల్లి పోయిన వారే ఎక్కువ. కుల సమస్యపై కొందరు, స్త్రీ సమస్య పై కొందరు, బీసీలకు ఇందులో ప్రోగ్రామ్స్ లేదు అని కొందరు, ఎన్నికలతో వచ్చే అధికారాన్ని వదిలేయడమేమిటి అని కొందరు ఇలా రకరకాల కారణాలు.

నేను అప్పటి నా అవగాహన

1986-87లో పార్టీలో చర్చ జరిగింది. నేను ఏమన్నాను అంటే...1977 నుండి 1984 దాకా విద్యార్థి సంఘాలు ఉన్నాయి, యువజన సంఘాలు ఉన్నాయి రైతు కూలీ సంఘాలు ఉన్నాయి, పౌర హక్కుల సంఘాలు ఉన్నాయి, సింగరేణి కార్మిక సమాఖ్య ...ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు ... ఇలా సంఘాలన్నింటినీ ఆర్గనైజ్ చేశాం కదా... ఇవి నిరంతరం సాగాలి. . ప్రజలు ఎప్పుడూ రహస్యంగా జీవించరు. ప్రజలు బహిరంగంగా జీవిస్తారు. కనుకే బహిరంగంగా జీవించగలిగే అవకాశాలు ఉండాలి. మనవల్ల వారిమీద నిర్బంధం ఉండకూడదు. మన రక్షణ కోసం మనం రహస్యంగా ఉండాలి. కుల సమస్యను తీసుకోవాలి. డా. బిఆర్ అంబేద్కర్ చెప్పిన విషయాలను లెక్కలోకి తీసుకోవాలి. ఫెమినిజం చెప్పిన అంశాలను స్వీకరించినట్టే అంబేద్కరిజం చెప్పిన అంశాలు స్వీకరించాలి అన్నాను. ఈ సూచనల పై వారు చాలా తేలికగా, క్రూరంగా ప్రవర్తించారు.

నేనేమన్నానంటే.. క్రాంతి పత్రిక ఉన్నది. ఆ క్రాంతి పత్రికలో రైతుకూలీ పోరాటాల గురించి, సింగరేణి పోరాటాల గురించి రాస్తే అది పార్టీ పత్రిక అవుతుంది. ఈ పార్టీ పత్రిక నీ దగ్ ఉంగర ది కాబట్టి నీ దగ్గరికి నాయకులు వస్తున్నారు. తిండి పెడుతున్నావు. సానుభూతిపరుడువి, కార్యకర్తవి అని అరెస్ట్ చేస్తున్నారు. అందువల్ల అలా వేయడానికి వీలులేదు. పార్టీ పత్రిక సిద్ధాంత పత్రికగా ఉండిపోవాలి. ప్రజల కోసం ప్రజాసంఘాల పత్రికలు ఉన్నాయి. అరుణతార, సృజన, రాడికల్ మార్చ్ , కార్మిక మార్గంతదితర ప్రజాసంఘాల పత్రికలలో వేసుకోవాలి.

బహిరంగ అవకాశాల ఆవశ్యకత- ఎన్నికల్లో పాల్గొనాలి.

ప్రజాసంఘాల ఉద్యమాల నుండి పార్టీ ఉద్యమం, , నిర్మాణం సెపరేట్ పెట్టుకోవాలి. విప్లవోద్యమం విజయవంతం అయ్యే వరకు నిరంతరం విద్యార్థులకు, యువకులకు, టీచర్లకు...ఇలా బహిరంగంగా ఉద్యమాలు చేసే అవకాశాలు ఉండాలి. ఒక్కొక్క జిల్లాలో లక్ష, రెండు లక్షల మందితో మీటింగ్ లు పెట్టినాము. రైతుకూలీ సంఘం మీటింగ్ 1983 మే నెలలో పెట్టినప్పుడు అప్పుడే ఎన్.టి.ఆర్ అధికారంలోకి వచ్చాడు. ఆ ఎన్.టి.ఆర్ ప్రభుత్వం పడిపోయి విప్లవోద్యమం అధికారంలోకి వస్తుంది అనే గొప్ప విశ్వాసం కలిగింది. అప్పుడు స్వామి అగ్నివేశ్ గారు కూడా కరీం నగర్కు వచ్చి మాట్లాడారు. అంత గొప్ప విశ్వాసం ప్రజల్లో కలిగిన దానిని ఎన్.టి.ఆర్ 1984 నుండి అణచివేశాడు. 1990 లో మర్రి చెన్నారెడ్డి వచ్చినప్పుడు అవకాశం వస్తే మళ్ళీ రెండు లక్షల నుండి ఎనిమిది లక్షల మందితో మీటింగ్స్ పెట్టాం. ఆ తర్వాత నిర్బంధాలు ప్రయోగించగానే మొదటినుంచి ఉన్న తెలంగాణవాదులం వరంగల్ లో తెలంగాణ డిక్లరేషన్ ని ప్రవేశ పెట్టి తెలంగాణ జనసభ అని, ఆ తర్వాత జనశక్తి వారు సభ పెడితే లాఠీలు అన్ని విరగొట్టి చంపేశారు. ఎందుకు ? మనం ఓట్లలో పాల్గొనలేదు. మనమే ఓట్లలో పాల్గొని ఉంటే... మనం వాళ్లను ఓడిస్తాం అనే భయం ఉండేది. అనే ఫీలింగ్ ఉండేది కదా వారికి. అట్లా... ప్రతిసారి ఓట్ల శక్తిని గుర్తించకపోవడం జరిగింది.

1956 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి వుంటే నక్సలైట్ ఉద్యమం వచ్చేది కాదు.

1996 నుండి విప్లవోద్యమ కార్యకర్తలే వెనకా ముందు ఉండి తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారు. కె.సి.ఆర్ ఒక విగ్రహం లాంటిది. రాష్ట్రపతి లాంటి బొమ్మ తప్ప ఆయన ఆర్గనైజర్ కాదు. అది అందరికి తెలుసు. కాని ఆయన క్లెయిమ్ చేసుకుంటున్నాడు. 1996 నుండి నుండి 2001 దాకా రాష్ట్రవ్యాప్తంగా గొప్ప సామాజిక, సైద్ధాంతిక చర్చలు చేశాము. , ఆ తర్వాత టి.ఆర్.ఎస్ వచ్చాక కూడా మిలియన్ మార్చ్, సాగరహారం చేసిందంతా ఈ విప్లవోద్యమ అభిమానులే. 'మన తెలంగాణ మనకు ఉంటే ఇంత నిర్బంధాలు ఉండవు' అని మనకు అర్థం అయిపోయి అట్లా చేయడం జరిగింది. 1956లో 1969 జైతెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి వుంటే తెలంగాణలో నక్సలైట్ల ఉద్యమం, మావోయిస్టు ఉద్యమం వచ్చేది కాదు. ఆంధ్ర ప్రాంత వాసుల అంతర్గత వలసాధిపత్యం, అణిచివేత, ఉద్యోగ అవకాశాలు ఆక్రమించడం వల్ల నక్సలైట్ ఉద్యమం రూపం తీసుకున్నది. ఆంధ్ర వలస వాదంలో భాగంగా తెలంగాణలో కమ్యూనిష్టు భావాలు ప్రవేశించాయి. వారి ఆధిపత్యాన్ని దోపిడీని కొనసాగించడానికి ఉపయోగ పడ్డాయి. ఈ విషయం మరోసారి .

(వ్యాస రచయిత సామాజిక తత్వవేత్త)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

99121 99844

ADRESS
Editor, Prathipaksham, Telugu Daily
8-1-284/ OU/521/7/9, OU Colony, Shaikpet, Hyderabad, Telangana 500008

గ్యాస్ సిలిండర్లు బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు

- తహసీల్దార్ గౌతమ్ కుమార్

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 14: అమెరికా-ఇరాన్ యుద్ధ ప్రభావంగా కొరత వార్తలు వస్తున్న సమయంలో, మండలంలో గ్యాస్ సరఫరా సురక్షితం అని మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఇండియాన్ గ్యాస్ గోడౌన్ ను తహసీల్దార్ గౌతమ్ కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...గ్యాస్ సిలిండర్లు బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా, ప్రజలకు సరిపడా గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకూడదు అని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్.ఐ. రాజేష్ ఉన్నారు.

రచయితలు సమాజానికి
దారి చూపే మార్గదర్శకులు

- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి
- ఘనంగా "రైటర్స్ మీట్" రజతోత్సవం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 14 : రచయితలు సమాజానికి దారి చూపించే మార్గదర్శకుల,ని వారిని గౌరవించాల్సిన భాద్యత అందరిపై ఉందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలుగు శాఖ కళల విభాగం ఆధ్వర్యంలో రచయితల సంఘం రజతోత్సవం సందర్భంగా "రైటర్స్ మీట్" కార్యక్రమం జరిగింది. దీనికి విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొ. ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అయన మాట్లాడుతూ రచయితలు, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా మాట్లాడుకునేందుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎల్లప్పుడూ ఒక వేదికగా ఉంటుందన్నారు. ఈ వేదిక ద్వారా రచయితలు వారి ఆలోచనలు, భావాలు, అనుభవాలు, సామాన్య ప్రజల సమస్యలకు గొంతుగా మారాలని అది తమ రచనల రూపంలో ప్రజలను చైతన్య పరచాలని రైటర్స్ సంఘం ప్రతినిధులకు సూచించారు. ఈ సంఘం స్థాపించి ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరుపుకునే వేడుక "రజతోత్సవం"లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భాగస్వామి కావడం గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రఖ్యాత రచయిత అల్లం రాజయ్య మాట్లాడుతూ విరసం లాంటి ప్రగతిశీల సంస్థల మూలంగానే డెమోక్రటిక్ స్పేస్ కోసం రైటర్స్ మీట్ సంస్థ ఏర్పాటైయిందని అన్నారు. 25 ఏళ్లుగా తెలుగు సాహిత్య వ్యాప్తికి, అధ్యయనానికి ఎనలేని కృషి చేస్తుండడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలలోని తెలుగు రచయితలను ఒకచోట చేర్చి, తెలుగు సాహిత్యానికి కొత్త దిశను చూపుతుందని పేర్కొంటూ కార్యక్రమ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత ఖదీర్ బాబు, ప్రఖ్యాత పాత్రికేయులు, సంపాదకులు డా. కె. శ్రీనివాస్, రచయిత, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, ప్రఖ్యాత రచయితలు ఎల్వీ. రెడ్డి, కేఎన్ మల్లీశ్వరీ, కుప్పిలి పద్మ, ఎన్. రజని, వాసిరెడ్డి నవీన్, పలువురు కథకులు, పలు రాష్ట్రాల నుంచి రచయితలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 14: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయాలలో నిర్వహించిన బడ్జెట్ సమావేశాల్లో చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపాలిటీలకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలను ఆమోదించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ అభివృద్ధికి సంబంధించిన బడ్జెట్ అంశాలపై సమావేశంలో చర్చించారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు మరియు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజ

ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 14 : స్వామియే శరణం అయ్యప్ప అంటూ చేవెళ్ల అయ్యప్ప దేవాలయం మార్మోగింది. దేవాలయం కమిటీ సభ్యులు ప్రతి రెండో శనివారం దేవాలయం లో పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. దేవాలయం లో శనివారం ఉదయం పూజారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గణపతి, సుబ్రమణ్యం, మాలిక పురోత్తమ మంజు మాత, నాగరాజు స్వాములకు ఉదయం పంచామృత అభిషేకాలు చేపట్టారు. అయ్యప్ప మాల ధరించిన దేవర రఘునాథ్ రెడ్డి, కన్నెస్వామి దేవర సాయి గిరీష్ రెడ్డి పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తి పాటలు అందరి ఆకట్టుకున్నాయి. భక్తులు 18 మెట్లకు పడిపూజ నిర్వహించారు. పడిపూజ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల ధరించిన అయ్యప్ప గురుస్వాములు మల్లారి దయాకర్ రెడ్డి, పెద్దినోళ్ల నర్సింలు, మహేందర్ రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి, అయ్యప్ప భక్తులు దామోదర్, కృష్ణ, బాలయ్య, వడ్ల శ్రీధర్ చారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి14: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని అగర్ మియాగూడ గ్రామ సర్పంచ్ బెల్లి స్వప్న శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం తో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం సర్పంచ్ చేతుల మీదుగా చేయడం జరిగిందన్నారు అంగన్వాడీ కేంద్రంలో ఈ యొక్క కార్యక్రమం నిర్వహించడం జరిగింది అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన హెల్త్ సూపర్వైజర్ శోభారాణి ఏఎన్ఎం మానెమ్మ ఆశ వర్కర్ జ్యోతి అంగన్వాడీ టీచర్ గోసుల బాలమణి తోపాటు వార్డు సభ్యులు లిక్కి జయమ్మ గ్రామ గర్భిని తల్లులకు సామూహిక శ్రీమంతాలు తోపాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం జరిగిందన్నారు అంగన్వాడీ టీచర్ ఆశ వర్కర్ ఆధ్వర్యంలో సర్పంచ్ స్వప్న శ్రీనివాస్ యాదవ్ ని ఘనంగా సన్మానించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ గర్భిని తల్లులు పాల్గొనడం జరిగిందని పేపర్ ప్రకటనలో గ్రామ సర్పంచ్ తెలియజేశారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ కన్వీనర్ గా

ఉమ్మడి ప్రవీణ్ పటేల్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 14: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్ పెట్ గ్రామానికి చెందిన ఇమ్మడి ప్రవీణ్ పటేల్ ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహేశ్వరం నియోజకవర్గంలో కన్వీనర్ గా నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం చైర్మన్ యాదాల మహేశ్వర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జ్ ప్రకటించారని ప్రవీణ్ తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారులను ఐక్యం చేస్తూ తెలంగాణ పునర్ నిర్మాణం కోసం పనిచేయాలని ఉద్యమకారుల ఆకాంక్ష కోసం పాటుపడాలని తెలియజేశారని ఇమ్మడి ప్రవీణ్ పటేల్ ప్రకటనలో తెలియజేశారు.

ఐక్యతతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

- మంజుల పత్తిపాటి

ప్రతిపక్షం, యాదాద్రి భువనగిరి, మార్చి 14: సమాజం అభివృద్ధి చెందాలంటే ఐక్యత ఎంతో అవసరమని ప్రముఖ మహిళా నాయకురాలు, సామాజిక కార్యకర్త, మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో తెలంగాణ కరణం నియోగ బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం యాదగిరిగుట్టలోని రెడ్డి సంక్షేమ సంఘం ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ కరణం నియోగ బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం శనివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణకు చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు, సామాజిక కార్యకర్త, కవయిత్రి మరియు మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తాను ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేసిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, "నేను ఒక కరణం ముద్దుబిడ్డను అని చెప్పుకోవడం నాకు ఎంతో గర్వంగా ఉంది" అన్నారు. ఈ రోజు జరుగుతున్న సమావేశం సాధారణ

సమావేశం కాదని, ఇది మన చరిత్రను గుర్తు చేసే సమావేశమని పేర్కొన్నారు. ఒకరి బాధ అందరి బాధగా, ఒకరి విజయం అందరి విజయంగా భావించినప్పుడే సమాజం బలపడుతుందని అన్నారు. ఈ సమావేశం కేవలం మన కోసం మాత్రమే కాకుండా, మన తర్వాతి తరం మనలాగే కష్టాలు పడకూడదనే సంకల్పంతో జరుగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో చకిలం అనిల్ కుమార్, చందుపట్ల వెంకటేశ్వరరావు తదితర కరణం నాయకులు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు. చివరగా మంజుల పత్తిపాటి "జై హింద్, జై తెలంగాణ" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

వాచ్ మెన్ దంపతుల దారుణ హత్య

- భవన నిర్మాణంలో వాచ్ మెన్ గా పనిచేస్తున్న భార్యాభర్తలు
- వలస జీవులను బలిగొన్న గుర్తు తెలియని దుండగులు
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ లతో పరిశీలన
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన శేరిలింగంపల్లి జోన్ డిసిపి శ్రీనివాస్ చింతమనేని

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 14 : బతుకుదెరువు కోసం వలసవచ్చి నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద వాచ్ మెన్ గా జీవనం సాగిస్తున్న బడుగు జీవులను అతికిరాతంగా ప్రాణాలు తీశారు గుర్తు తెలియని దుండగులు. వాచ్ మెన్ దంపతుల దారుణ హత్య తో పటాన్ చెరు పారిశ్రామిక వాడ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మహబూబాద్ జిల్లా గూడూర్ మండలం దొంగచింత తాండకు చెందిన సోమ్లా దశరథ్(50) మాన్యమ్మ(45) దంపతులు జీవనోపాధి కోసం మూడున్నర సంవత్సరాల క్రితం ఇంద్రేశం మున్సిపాలిటీ లోని సిటిజెన్ కాలనిలోని నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో వాచ్ మెన్ గా చేరి భవనం పక్కనే గుడిసె వేసుకొని నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి గుడిసెలో పడుకున్న దంపతులిద్దరిని గుర్తు తెలియని దుండగులు దంపతుల తలలపై అతి కిరాతకంగా కొట్టి హత్య చేశారు. శనివారం ఉదయం పనుల కోసం వచ్చిన నిర్మాణ సిబ్బంది, దంపతులు రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. శేరి లింగంపల్లి జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్, రామచంద్రాపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్, సీఐ వినాయక్ రెడ్డి, ఎస్సైలు రాజు, విద్యా చరణ్ రెడ్డి లు ఘటనాస్థలికి చేరుకుని పూర్వపరాలను పరిశీలించారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ల సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులకు ఇద్దరు కూతుళ్లు కాగా పెద్ద కూతురికి వివాహం అయ్యింది. చిన్న కూతురు హాస్టల్ లో ఉంటూ పదవ తరగతి పరీక్ష రాస్తుంది. శేరిలింగంపల్లి జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వాచ్ మెన్ దంపతుల హత్యతో పటాన్ చెరు పారిశ్రామికవాడ ఒక్కసారిగా ఉలిక్కిపాటు గురైంది. హత్యకు పాల్పడ్డ వారిని త్వరలోనే పట్టుకుని మిస్టరిని చెదిస్తామని పోలీసులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత

- కల్వకోల్ సర్పంచ్ లక్ష్మమ్మ రవి మాదిగ

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 14: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో ప్రజా పాలన పల్లె ప్రగతి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగముగా గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ మరియు పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఈరోజు నర్సరీ షెడ్ నెట్ ఏర్పాటు చేయడం జరిగింది మరియు వీధి కుక్కల సర్వే చేసి వ్యాక్సినేషన్ గురించి చర్చించనైనది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఉప సర్పంచ్ పులిమామిడి జనార్ధన్ గౌడ్ విలేజ్ సెక్రెటరీ శ్రీనివాస్ బొజ్జం మల్లేష్ మంగ శ్రీనివాస్ గూడెపు రాధా కుమార్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, మార్చి 14 : మక్తల్ పట్టణ కేంద్రంలో శనివారం పదో తరగతి (ఎస్ఎస్సి) వార్షిక పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల మొదటి రోజున ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విద్యాశాఖ అధికారులు, పోలీస్ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించారు. పట్టణంలోని ఆరు పరీక్షా కేంద్రాలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 290, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 280, గవర్నమెంట్ హైస్కూల్లో 240, బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో 195, శ్రీ చైతన్య హై స్కూల్ లో 300, కృష్ణవేణి హైస్కూల్లో 237, మొత్తం 1542 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను చాటుకున్నట్లు మండల విద్యాధికారి అమీరుద్దీన్ తెలిపారు. ఉదయం నుండే విద్యార్థులు తమ తమ కేంద్రాలకు చేరుకోగా, అధికారులు నిబంధనల ప్రకారం వారిని లోపలికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అక్రమాలకు తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. మొదటి రోజు పరీక్ష విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో ముగియడంతో అటు అధికాలు, ఇటు తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆపత్కాలంలో మేము సైతం

- పౌర రక్షణ వాలంటీర్లుగా శిక్షణ పొందుతున్న గీతం విద్యార్థులు.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 14 : అనుకోని విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రభుత్వ సాయం కోసం వేచి చూడకుండా తక్షణమే తోటి పౌరులకు తగిన సహాయ సహకారాలను అందించే లక్ష్యంతో పౌర రక్షణ వాలంటీర్లుగా గీతం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. తెలంగాణ అగ్నిమాపక విపత్తు స్పందన అత్యవసర & పౌర రక్షణ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల 'పౌర రక్షణ స్వచ్ఛంద శిక్షణ - సామర్థ్య నిర్మాణం' కార్యక్రమాన్ని ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేశారు. పౌర రక్షణ, విపత్తు నివారణ, అగ్ని ప్రమాదాలపై ప్రాథమిక జ్ఞానం, అగ్నిమాపక చర్యలు, గాలింపు, సహాయక కార్యక్రమాలు, ప్రథమ చికిత్స వంటి కీలక అంశాలపై ఇస్తున్న ఈ శిక్షణలో దాదాపు వంద మంది గీతం విద్యార్థులు పాల్గొంటున్నారు. రక్షణ పరికరాలు, అగ్నిమాపక వ్యవస్థలు, అత్యవసర ప్రతిస్పందన పద్ధతులు, ఆయా పరికరాల వినియోగంపై విద్యార్థులు ఆచరణాత్మక అనుభవాన్ని కూడా పొందుతున్నారు. ఈ శిక్షణ ప్రారంభోత్సవంలో సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక అధికారి బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, విపత్తులు, అత్యవసర పరిస్థితులలో అధికారులకు సహాయపడేందుకు శిక్షణ పొందిన స్వచ్ఛంద సేవకుల బలమైన నెట్ వర్కును నిర్మించడం యొక్క ఆవశ్యకతను వివరించారు. అగ్నిప్రమాదాలు, దుర్ఘటలను, అలాగే సహజ లేదా మానవ కల్పిత విపత్తుల వంటి అత్యవసర పరిస్థితులలో సంబంధిత శాఖలకు సహాయపడేందుకు విద్యార్థులకు అత్యంత కీలకమైన నైపుణ్యాలను ఈ శిక్షణలో నేర్పిస్తున్నట్టు పటాన్ చెరు అగ్నిమాపక శాఖాధికారి కె.వి. నాగేంద్ర పేర్కొన్నారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), పోలీసు, అగ్నిమాపక సేవల వంటి సంస్థలతో సమన్వయం చేసుకోవడం, సంక్షోభాల సమయంలో వ్యవస్థీకృత, ప్రభావవంతమైన ప్రతిస్పందన కోసం ఈ శిక్షణ ఉపకరిస్తుందని వారు తెలియజేశారు. విపత్తు నిర్వహణలో సమాజ సంసిద్ధతను బలపేతం చేయడానికి, స్వచ్ఛంద సేవను ప్రోత్సహించడానికి దీనిని నిర్వహిస్తున్నామని వారు వెల్లడించారు. అరుదుగా లభించే ఇటువంటి శిక్షణ కార్యక్రమంలో గీతం విద్యార్థులు కూడా ఎంతో ఉత్సుకతతో పాల్గొంటున్నారు.

కార్పొరేషన్ అభివృద్ధి నా బాధ్యత

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల

ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి, మార్చి14: మంచిర్యాల కార్పొరేషన్ అభివృద్ధి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. శనివారం మంచిర్యాల లోని 37 55 14 డివిజన్లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆయన పర్యటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గల 60 డివిజన్ల అభివృద్ధి తన జిమ్మదారని తెలిపారు ఇవ్వరు ఎక్కడ ఏ సమస్య ఉన్న తనకు తెలియజేయాలని అన్నారు శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత స్పెషల్ డ్రైవ్ ను ఆయన నిర్వహించారు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య కమిషనర్ అన్వేష్ లతోపాటు కార్పొరేటర్లు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

"



తెలంగాణలో మే 11 నుంచి జూన్ 9 వరకు తొలిదశ జనగణన జరగనుంది. సర్వేలో 33 రకాల ప్రశ్నలుంటాయి. వివరాలు చెప్పకుంటే రూ.1000 ఫైన్ విధిస్తాం. జనగణన ఆధారంగానే ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తాయి. ప్రజలు ఎన్యుమరేటర్లకు పూర్తిగా సహకరించి డీటెయిల్స్ ఇవ్వాలి. రెండో దశ సెన్సస్ 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు కొనసాగుతుంది.

- భారతి హోలికేరి, ఐఏఎస్

కాలువల భూసేకరణకు రూ.30 కోట్లు కేటాయించాలి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 14: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలో నిర్మించిన అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయకసాగర్, శ్రీకొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన లేఖ రాశారు.2020 నుండి 2023 వరకు ఈ రిజర్వాయర్ల ద్వారా ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ కాలువలను పూర్తి చేసి సిద్దిపేట జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు కొత్త ఆయకట్టు సృష్టించామని హరీష్ రావు తెలిపారు. కాలువల ద్వారా చెరువులు, కుంటలు, వాగులు, చెక్‌డ్యాములు మరియు నేరుగా ఆయకట్టుకు నీరు అందించడం వల్ల పంట దిగుబడులు పెరిగాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 27 నెలలు గడిచినా ఈ రిజర్వాయర్ల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. ఈ కాలంలో ఒక్క గజం కాలువ కూడా తవ్వలేదని చెప్పారు.మైనర్, సబ్ మైనర్ కాలువల నిర్మాణానికి భూసేకరణ అత్యవసరమని, ఈ విషయాన్నిపలుమార్లు లేఖల ద్వారా, ఫోన్ ద్వారా, వ్యక్తిగతంగా కూడా మంత్రికి వివరించానని తెలిపారు. ప్రభుత్వ నినాదం అయిన "తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు" సిద్దిపేట జిల్లాలో అమలు చేయడం సాధ్యమని అన్నారు. అన్నపూర్ణ (అంతగిరి) రిజర్వాయర్ ప్యాకేజీ 10కి రూ.15 కోట్లు, రంగనాయకసాగర్ ప్యాకేజీ 11కి రూ.15 కోట్లు కేటాయించి మొత్తం రూ.30 కోట్లతో భూసేకరణ పూర్తి చేస్తే అదనంగా లక్ష ఎకరాలకు కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుందని సూచించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొత్త ఆయకట్టు ముందుకు సాగడం లేదని, వేలాది మంది రైతులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా వెంటనే కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయాలని హరీష్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

పేదలకు మరింత చేరువగా అధునాతన వైద్యం

- ఇక నుండి రోగులకు మరింత దగ్గర కానున్న అధునాతన ప్రభుత్వ వైద్యం
- రూ. 25 లక్షలతో దుబ్బాక ఆస్పత్రికి ఎన్ టి పి సి వారి సహకారం తో ల్యాపోస్కోపి పరికరాలు
- ఆడ బిడ్డలు హెచ్పీవీ టీకా తప్పని సరిగా తీసుకోవాలి
- మెదక్ ఎంపీ ఎం .రఘునందన్ రావు

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 14: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే ఎన్ టి పి సి వారి సహకారం తో తాము ఆస్పత్రిలో రూ, 25 లక్షలతో గైనకాలజీ ల్యాప్రోస్కోపి యంత్ర పరికరాలను ప్రారంభించుకోవడం జరిగిందని ఎం పి రఘునందన్ రావు అన్నారు. అంతకు ముందు ఆస్పత్రిలో బాలికలకు (హెచ్పివి) టీకా కేం ద్రాన్ని ఎం పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వెల్ ఆస్ప త్రులల్లో చేయలేని ఆపరేషన్లు మారుమూల ప్రాంతమైన దుబ్బాక వంద పడకల ఆసుపత్రి లో రోగులకు అన్ని రకాల ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇటీవల కాలంలో రోగులు ఆపరేషన్లు ల్యాప్రోస్కోపి సర్జరీల పై దృష్టి సారిస్తున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని దుబ్బాక వంద పడకల అస్పత్రిలో రోగులకు ఈ ల్యాప్రోస్కోపి సర్జరీ ఎంతో అవసరమని తెలుసుకుని తాను దుబ్బాక ఆస్ప త్రికి సీఎస్ఆర్ నిధుల కింద ఎన్టీపీసీ యాజమాన్యంను ఒప్పించి రూ 25 లక్షల నిధులతో ల్యాప్రోస్కోపి సర్జరీకి సంబందించి కెమరాలు, సిలిండర్లు ఇతర సామాగ్రిని అందజేయడం జరిగిందన్నారు. ఇక్కడ ఉన్న ఆరోగ్య సిబ్బంది, జిల్లా ఆరోగ్య సిబ్బంది ఇక్కడికి వచ్చే రోగులకు మంచి వైద్య సేవలు అందించాలని కోరారు. ఇటీవల చాల మంది ల్యాప్రోస్కోపి ఆపరేషన్లకు ఇష్టపడుతున్నారని ఇట్టి ఆపరేషన్లకు చాల డబ్బులు ఖర్చు అవుతున్నాయని ఇలాంటి ఆపరేషన్లు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా అందుబాటులోకి తీసకరావడం కోసం తాను దుబ్బాక ఆస్ప త్రికి మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ ఆపరేషన్ కారణంగా వారం రోజుల్లో రోగులు తిరిగి ఎవరి పనులు వారు చేసుకోవచ్చని తెలిపారు.నెలల తరబడి ఇంట్లో విశ్రాంతి తీసుకోకుండ ఈ ల్యాప్రోస్కోపి ఆపరేషన్ తక్కువ సమయంలో చిన్నగా చేయడం జరుగుతుందని తెలిపారు. అందుకే ఆపరేషన్ చేసుకున్నవారు రెండు మూడు రోజుల్లో విశ్రాంతి తీసుకొని పనులు చేసుకోవచ్చని తెలిపారు. దుబ్బాకలో ఈ ఆపరేషన్ కోసం పేషెంట్లు ఇతర పట్టణాలకు వెళ్ళకుండ ఉండడం కోసం దుబ్బాకలో ఈ ల్యాప్రోస్కోపి ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత,వైస్ చైర్ పర్సన్ ఆస సులోచన, కౌన్సిలర్లు, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్, బిజెపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 14: పెద్దమ్మ తల్లి దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలి అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బ క్కీ వెంకటయ్య అన్నారు. దుబ్బాక మండలంలోని అచ్చుమయి పల్లి గ్రామం లోని శ్రీ పెద్దమ్మ తల్లి కళ్యాణ ఉత్సవంలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మెన్ ను ముదిరాజు సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అక్బరు పేటభూంపల్లి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు మండల కుమార్,యేసు రాజు, దుబ్బాక మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దేవరాజు, ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి
- లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాల పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 14 : ఇందిరమ్మ రాజ్యంలోబీసీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం డిచ్ పల్లి కేఎన్ఆర్ గార్డెన్ లో రూరల్ నియోజకవర్గంలో పలు మండలాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కుల పంపిణీ తో పాటు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ nదేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. అనంతరం నిజామాబాద్ రూరల్, మోపాల్, ఇందల్వాయి, జక్రాన్ పల్లి, సిరికొండ మండలాలకు చెందిన 246 మంది లబ్ధిదారులకు రూ. 2,46,28,536 విలువ చేసే లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే డిచ్ పల్లి, ఇందల్వాయి, జక్రాన్ పల్లి మండలాలకు చెందిన 153 మంది లబ్ధిదారులకు రూ.7కోట్ల 65 లక్షల విలువ గల ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను పంపిణీ చేశారు. అంతకు ముందు ఇటీవల మరణించిన డిచ్ పల్లి మాజీ ఎంపీపీ పార్టీ సీనియర్ నాయకులు కంచెట్టి గంగాధర్, పార్టీ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి మరణం పట్ల సంతాపం ప్రకటించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సభావేదికగా వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డిచ్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు మునిపెల్లి సాయిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, యువ నాయకులు ఉమ్మాజి నరేష్, హన్మండ్లు, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

త్వరితగతిన వార్డు సమస్యల పరిష్కారం

- మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 14 : మెదక్ పట్టణంలోని 30వ వార్డులో చిన్నచిన్న సమస్యలను వెంటనే, ప్రధాన సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా ఆమె 30వ వార్డును సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించారు. వార్డులో మంచినీటి, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. పుచ్చకాయల గడ్డలో ఒక బోరు, రంగరాజు గల్లిలో మరో బోరు వేయాలని వార్డు ప్రజలు కోరారు. డ్రైనేజీలపై మాన్యువల్స్ వేయడం, చిన్నచిన్న వీధుల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్ వేసి ఇంటింటికీ నీటి సరఫరా చేయాలని కౌన్సిలర్ అరునార్తి వెంకటరమణ అధికారులకు సూచించారు.పాత ఇళ్లకు ఇంటి పన్ను రసీదు ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయించాలని కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కోరారు.వార్డులోని సమస్యలను మున్సిపల్ సిబ్బంది నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ వెంకటరమణ, మున్సిపల్ సానిటరీ సిబ్బంది, ఆర్‌పి జ్యోతి,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ ,మార్చి 14 : మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ వద్ద జాతీయ రహదారిపై 765 డి పై నా శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నర్సాపూర్ వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న బైక్ మెదక్ నుంచి సంగారెడ్డి వెళ్తున్న ఆర్ టీ సీ బస్ ఢీ కొని ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం బైకు అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులు హవేలీఘనపూర్ మండలం బూరుగుపల్లి కి చెందిన తండ్రి కొడుకులు అమృత్ గౌడ్ (51), రిశివర్ధన్ గౌడ్ (13), బొగడ భూపతి పూర్ కు చెందిన సాయ గౌడ్ (32) గా గుర్తించారు సంఘటన స్థలానికి చేరుకున్న కొల్చారం పోలీసులు మృతదేహాలను మెదక్ ఏరియా హాస్పిటల్ కు తరలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాప్యంలో కన్నతండ్రిని వేధిస్తున్న కొడుకులు

- కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 14: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని గంగాపూర్ గ్రామంలో వృద్ధ తల్లిదండ్రులను వేధిస్తున్న ఇద్దరు కొడుకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన కొండి నారాయణరెడ్డి (94)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమారుడు రాజిరెడ్డి సిద్దిపేటలో వ్యాపారం చేస్తుండగా, చిన్న కుమారుడు పరమేశ్వర్ రెడ్డి గంగాపూర్‌లో వ్యవసాయం చేస్తున్నాడు.నారాయణరెడ్డి తనకు ఉన్న 7 ఎకరాల భూమిని ఇద్దరు కొడుకులకు సమానంగా (చెరి 3½ ఎకరాలు) రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. వృద్ధాప్యంలో తమను చూసుకుంటారని భావించి ఆస్తిని అప్పగించినప్పటికీ, కొడుకులు మాట మార్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తల్లిదండ్రులను పాత ఇంట్లో ఉంచి కనీస సౌకర్యాలు కల్పించకుండా, సరిగా తిండి కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎదురుతిరిగి ప్రశ్నిస్తే దూషిస్తూ చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్సై చంద్రమోహన్ మానవత్వంతో స్పందించారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితిలో ఉండటంతో వారు నేరుగా నారాయణరెడ్డి నివాసానికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించారు. వృద్ధులను వేధించడం చట్టరీత్యా నేరమని పేర్కొంటూ, బాధ్యులైన ఇద్దరు కొడుకులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు పటిష్ట పోలీసు బందోబస్తు

- జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 14: మెదక్ జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. శనివారం హవెలిఘనపూర్ మండలం సర్ధనలోని ప్రభుత్వ పాఠశాల, మెదక్ పట్టణంలోని సిద్ధార్థ హై స్కూల్, గర్ల్స్ హై స్కూల్ పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ తరపున విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. చీటీలు పంపించడం, ప్రశ్నాపత్రాల లీకేజ్ వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణా, సమాధాన పత్రాల భద్రత కోసం ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేందుకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

పారదర్శకంగా 'పది' పరీక్షలు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 14: సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నంగునూరు మండలం రాజగోపాల్‌పేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్ఎస్‌సి-2026 బోర్డు మార్గదర్శకాల ప్రకారం పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష గదుల్లో ఎలాంటి పుస్తకాలు, చార్ట్‌లు లేకుండా చూడాలని, మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించకూడదని, పూర్తి తనిఖీ చేసిన తరువాతే విద్యార్థులను లోపలికి అనుమతించాలని అధికారులకు సూచించారు. కేంద్రం చుట్టూ 144 సెక్షన్ అమలుతో పాటు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల కార్యాచరణలో భాగంగా నంగునూరు మండలం నర్మేట గ్రామంలోని పల్లె ప్రకృతి వన నర్సరీలో మొక్కల పెంపకం పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీ నిర్వహణ పనులు, వీధి కుక్కల సర్వే మరియు వాక్సినేషన్ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మునగ, గులాబీ, గన్నేరు, కానుగ, అడవి తంగేడు వంటి మొక్కలను పరిశీలిస్తూ సహజసిద్ధంగా లభించే ఎరువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. మునగ మొక్కలను హాస్టళ్లు, పాఠశాలలకు సరఫరా చేయాలని తెలిపారు.కానుగ మొక్కల పెంపకాన్ని పెంచాలని, ఇవి వేసవిలో చల్లదనాన్ని కలిగిస్తాయని చెప్పారు. వేసవి కాలం కావడంతో మొక్కలకు సమయానికి నీరు అందించాలని, నర్సరీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే సీజన్‌కు సరిపడా మొక్కలు పెంచేందుకు అవసరమైన మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని, గ్రామంలో నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మరియు సిబ్బందిని ఆదేశించారు.

మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు రెండేళ్లు తమ ఆస్తులు కాపాడుకోవాలి. తర్వాత తమ ప్రభుత్వమే వస్తుంది. రానున్న రెండేళ్లు కాంగ్రెస్ బుల్డోజర్ ప్రభుత్వంపై పోరాటానికి మూసీ బాధితులంతా తమకు అండగా ఉండాలలి. మూసీని మురికికూపంగా మార్చిందే కాంగ్రెస్.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.

మమత సర్కార్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

- బెంగాల్4లో 'మార్పు'ను ఎవరూ ఆపలేరు: మోదీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్‌కతా, మార్చి 14: అక్రమ చొరబాటుదారులను రక్షించేందుకే తృణమూల్ కాంగ్రెస్ ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే మమతా బెనర్జీ సర్కార్ ఇలా చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో టీఎంసీ పాలనలో అదుపులేని అక్రమ వలసల వల్ల అనేక ప్రాంతాల్లో హిందువులు మైనారిటీలుగా మారిపోయారని పేర్కొన్నారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడిన మోదీ, టీఎంసీపై విమర్శల వర్షం కురిపించారు. మరోవైపు, మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ శరణార్థులకు పౌరసత్వం కల్పించడాన్ని అడ్డుకుంటోందని మోదీ ఆరోపించారు. హిందూ శరణార్థులు తమకు ఓటు వేయరనే కారణంతోనే తృణమూల్ కాంగ్రెస్ ఇలా చేస్తోందని అన్నారు. ఎన్నికల కమిషన్ లాంటి రాజ్యాంగబద్ధమైన సంస్థలపై టీఎంసీ దాడులకు దిగడం సిగ్గుచేటని మోదీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోన్న, బంగాల్‌కు 'మహా జంగిల్‌రాజ్' పాలనను తీసుకొచ్చిన మమతా సర్కార్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని అన్నారు. నిరంకుశ టీఎంసీ ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా, 'మార్పు అనే తుపాను'ను ఆపలేదని పేర్కొన్నారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లోని భారీ జనసమూహమే ఇందుకు నిదర్శనమన్నారు. బంగాల్‌లో మళ్లీ చట్టబద్ధమైన పాలన వస్తుందని, అప్పుడు దురాగతాలకు పాల్పడిన టీఎంసీ నాయకులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

విశ్వ వీక్షణం

అఫ్ఘాన్ పై విరుచుకుపడ్డ పాక్

- 270 కి పైగా రాకెట్లతో దాడి

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: పాకిస్థాన్‌అఫ్ఘానిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నాయి. గత 48 గంటల్లో అఫ్ఘాన్‌లోని కునార్ ప్రాంతంపై పాక్ 270కు పైగా రాకెట్లు, ఫిరంగి గుండ్లను ప్రయోగించిందని సీఎన్ఎన్‌న్యూస్ 18 తెలిపింది. పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న తూర్పు అఫ్ఘాన్ ప్రావిన్స్‌లోని అనేక జిల్లాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఈ ఏడాది ఆరంభంలో ఇరు దేశాల మధ్య ఘర్షణ ప్రారంభమైన తర్వాత ఇది అత్యంత తీవ్రమైన దాడుల్లో ఒకటిగా భావిస్తున్నారు. కాగా, కునార్‌లోని పలు ప్రాంతాపై దాడులు జరిగాయని అఫ్ఘాన్ ప్రతినిధి జియాఉ ర్రేహాన్ స్పిన్‌ఘర్ వెల్లడించారు. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఆయన చెప్పారు. మిలిటెంట్ స్థావరాల నాశనం పేరుతో గత వారం రోజులుగా పాకిస్థాన్ వాయు సేనలు అఫ్ఘాన్‌లోని పలు ప్రాంతాపై విస్తృతంగా దాడులు చేస్తున్నాయి. పాక్‌లో ఉగ్రవాద చర్యలకు పాల్పడిన అఫ్ఘాన్ తాలిబన్, తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) మిలిటెంట్ గ్రూపుల అంతానికి తాము దాడులు నిర్వహిస్తున్నామని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ తెలిపింది. కాగా, పాక్ వాదనను తిరస్కరించిన అఫ్ఘాన్, తమ దేశంలోని అమాయక పౌరులను పాకిస్థాన్ చంపుతున్నదని విమర్శించింది. పాక్ మిలిటరీ కేంద్రాల లక్ష్యంగా తాము దాడులు జరిపినట్టు పేర్కొన్నది.

దేశంలో నదులు తెలుసుకుందాం!

భారతదేశంలో 200 కి పైగా నదులున్నాయి. ఇవి వ్యవసాయం, జీవనోపాధి మరియు నాగరికతకు జీవనాడులు. ఈ కథనం తెలుగు రాష్ట్రాల్లోని అనేక జిల్లాలు మరియు తమిళనాడు, కర్నటక, మహారాష్ట్ర రైతులకు ఆధారమైన పలు నదుల పొడవును వివరిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో కీలక నదులైన కృష్ణా, గోదావరి విశేషాలు తెలుసుకోండి మరి.

భారతదేశం పొడవైన నదులకు నిలయం. ఈ నదులు చారిత్రక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి మరియు భారతీయుల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. అవి వ్యవసాయానికి కీలకం. నాగరికతకూ మూలంగా ఉంటాయి. 200 కి పైగా నదులు భారతదేశ విశాల భూభాగం గుండా ప్రవహిస్తాయి. చాలా భారతీయ నదులు ఆరావళి, కారకోరం మరియు హిమాలయ పర్వత శ్రేణులలో ఉద్భవిస్తాయి. వ్యవసాయం భారతదేశానికి వెన్నెముక, మరియు నదులు నీటి పారుదల వ్యవస్థకు జీవనాడిగా కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా, ఈ నదులు దేశం యొక్క భూగోళం, ఆర్థిక వ్యవస్థ మరియు సంస్కృతిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. భారతదేశంలో ప్రవహించే పొడవైన నదులు ఏవి?

గంగా నది

ఉత్తరాఖండ్‌లోని గంగోత్రి హిమానీనదం నుండి ఉద్భవించే గంగా భారతదేశంలోనే అతి పొడవైన నది. ఇది ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్ మరియు పశ్చిమ బెంగాల్ వంటి అనేక రాష్ట్రాల గుండా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. గంగా నది మొత్తం పొడవు దాదాపు 2,525 కి.మీ. దీనిని బంగ్లాదేశ్‌లో పద్మ నది అని కూడా పిలుస్తారు. గంగా నదిని భారతదేశంలో అత్యంత పవిత్రమైన నదిగా భావిస్తారు.

గోదావరి

గంగా తర్వాత, భారతదేశంలో రెండవ అతిపెద్ద నది గోదావరి. ఈ నది పొడవు దాదాపు 1,465 కి.మీ. మహారాష్ట్రలోని త్రయంబక్ కొండల నుండి ఉద్భవించే ఈ నది మహారాష్ట్ర, కర్ణాటక మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నది సాంస్కృతిక మరియు ఆర్థిక ప్రాముఖ్యతను కలిగి ఉంది మరియు లక్షలాది మంది ప్రజలకు జీవనాధారం. గోదావరి నదికి ప్రవర, మంజీర, పెన్‌గంగా, వార్ధా, ఇంద్రావతి మరియు శబరి వంటి అనేక ఉపనదులు ఉన్నాయి.

కృష్ణా నది

భారతదేశంలోని మూడవ అతిపెద్ద నది కృష్ణా. మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల నుండి ఉద్భవించే కృష్ణా నది దాదాపు 1,400 కి.మీ. పొడవు ఉంటుంది. ఈ నది మహారాష్ట్ర, కర్ణాటక మరియు ఆంధ్రప్రదేశ్ గుండా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది.

తుంగభద్ర, భీమా, ఘటప్రభ, మలప్రభ మరియు మూసి వంటి అనేక నదులు కృష్ణా నదికి ఉపనదులు. కర్ణాటకలో ఉద్భవించే తుంగభద్ర నది కృష్ణా నదికి అతిపెద్ద ఉపనదులలో ఒకటి.



యమునా

దాదాపు 1376 కి.మీ. పొడవున్న యమునా నది భారతదేశంలో నాల్గవ అతిపెద్ద నది. ఈ నది ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉత్తరకాశీ జిల్లాలోని యమునోత్రి హిమానీనదం నుండి ఉద్భవిస్తుంది. గంగా నదికి ఉపనది అయిన ఇది హిమాలయ ప్రాంతం, హర్యానా, ఢిల్లీ మరియు ఉత్తరప్రదేశ్ గుండా ప్రవహించి ప్రయాగ్‌రాజ్ వద్ద గంగా నదిలో కలుస్తుంది.

నర్మదా నది

భారతదేశంలోని ఐదవ అతిపెద్ద నది నర్మదా. ఇది దాదాపు 1,312 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తుంది. నర్మదా మధ్య భారతదేశంలో ప్రవహించే ప్రధాన నది. మధ్యప్రదేశ్‌లోని అమరకంటక్ పీఠభూమి నుండి ఉద్భవించే ఈ నది పశ్చిమానికి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మరియు గుజరాత్ రాష్ట్రాల గుండా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తుంది. తవా, బర్నా, శక్కర్ మరియు హిరణ్ నదులు నర్మదా నదికి ప్రధాన ఉపనదులు. నీటిపారుదల, జలవిద్యుత్ ఉత్పత్తి మరియు నీటి సరఫరా కోసం ఈ నదిపై అనేక ఆనకట్టలు మరియు జలాశయాలను నిర్మించారు. దేశంలోని ప్రసిద్ధ సర్దార్ సరోవర్ ఆనకట్ట కూడా గుజరాత్‌లో ఈ నదిపైనే ఉంది.

సింధు

భారతదేశంలో 7వ అతి పొడవైన నది సింధు నది. టిబెటన్ పీఠభూమిలోని మానససరోవరం నుండి ఉద్భవించే ఈ నది లడఖ్ మరియు జమ్మూ కాశ్మీర్ ప్రాంతాల గుండా ప్రవహించి పాకిస్తాన్‌ను చేరుకుని చివరికి అరేబియా సముద్రంలో కలుస్తుంది. సింధు నది మొత్తం పొడవు 3,180 కిలోమీటర్లు.ఇందులో చాలా తక్కువ భాగమే భారత దేశంలో ఉంటుంది.

బ్రహ్మపుత్ర

దేశంలోని ఏడవ అతిపెద్ద నది అయిన బ్రహ్మపుత్ర నది, హిమాలయాల్లోని కైలాస పర్వతం సమీపంలోని చెమాయుంగ్ హిమానీనదం నుండి ఉద్భవిస్తుంది. ఈ ప్రాంతం చైనాలో ఉంది. బ్రహ్మపుత్ర నది మొత్తం పొడవు దాదాపు 2,900 కిలోమీటర్లు, కానీ ఈ నదిలో 918 కిలోమీటర్లు మాత్రమే భారతదేశంలో ఉన్నాయి. బ్రహ్మపుత్ర నది అరుణాచల్ ప్రదేశ్ గుండా భారతదేశంలోకి ప్రవేశిస్తుంది. ఆ రాష్ట్రంలో దీనిని సియాంగ్ నది అని పిలుస్తారు. ఇది గంగా మరియు మేఘ్న నదులతో కలిసి ప్రపంచంలోనే అతిపెద్ద డెల్టా అయిన సుందర్బన్స్ డెల్టాను ఏర్పరుస్తుంది మరియు బంగాళాఖాతంలో కలుస్తుంది.

మహానది

858 కిలోమీటర్ల పొడవున్న భారతదేశంలో 8వ అతి పొడవైన నది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ జిల్లాలో ఉద్భవించే ఈ నది తూర్పునకు ప్రవహిస్తుంది. ఇది ఛత్తీస్‌గఢ్ మరియు ఒడిశా రాష్ట్రాల గుండా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. శియోనాథ్, జోంక్, హస్దియో, ఓంగ్ మరియు టెల్ నదులు మహానదికి ప్రధాన ఉపనదులు. ఛత్తీస్‌గఢ్ మరియు ఒడిశాలో వ్యవసాయ ఉత్పత్తికి దోహదపడే ఈ నది నీటిని నీటిపారుదల కోసం విస్తృతంగా ఉపయోగిస్తారు.

కావేరి

భారతదేశంలో 9వ అతి పొడవైన నది కావేరి. ఇది కర్ణాటకలోని కొడగు కొండల నుండి ఉద్భవిస్తుంది. కావేరి నది కర్ణాటక మరియు తమిళనాడు రాష్ట్రాల గుండా తూర్పునకు ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. ఇది దాదాపు 800 కిలోమీటర్ల మొత్తం దూరం ప్రవహిస్తుంది. హేమావతి, కబిని, అర్కావతి, శింషా మరియు అమరావతి వంటి అనేక నదులు కావేరి నదికి ఉపనదులు.

తప్తి

తప్తి నది భారతదేశంలో పదవ అతి పొడవైన నది. మధ్యప్రదేశ్‌లోని సాత్పురా శ్రేణి నుండి ఉద్భవించే ఈ నది మొత్తం పొడవు దాదాపు 724 కిలోమీటర్లు. ఇది మహారాష్ట్ర మరియు గుజరాత్ గుండా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తుంది.







కేజ్రీవాల్‌కు ఏటీఎంలా మారిన పంజాబ్ సర్కార్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ,మార్చి 14: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. భగవంత్ మాన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ఆ పార్టీ అగ్రనేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఒక ఏటీఎంలా మారిపోయిందని షా ఆరోపించారు. అప్పులు, డ్రగ్స్, అక్రమ మత మార్పిడులు, అవినీతి, గ్యాంగ్‌స్టర్ల అరాచకాలతో పంజాబ్ నాశనమైందన్నారు. మాదకద్రవ్యాల సమస్య నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయగలిగే శక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి మాత్రమే ఉందన్నారు. శనివారం పంజాబ్‌లోని మోగా జిల్లా, కిల్లి చాహ్లన్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. పంజాబ్ ప్రజలు గతంలో కాంగ్రెస్ పార్టీకి, శిరోమణి అకాలీదళ్, ఆమ్ ఆద్మీ పార్టీకి అవకాశాలు ఇచ్చారని షా గుర్తు చేశారు. 2027లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మాదకద్రవ్యాల వ్యాపారాన్ని సమూలంగా నిర్మూలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు, రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి షా ప్రస్తావించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే ధైర్యం 'ఆప్'నకు లేదని, దాన్ని అరికట్టడంలో కాంగ్రెస్, అకాలీలు ఇప్పటికే విఫలమయ్యాయని విమర్శించారు. అయితే వాటిని రాష్ట్రం నుంచి పూర్తిగా తొలగించగలిగే వారు ఎవరైనా ఉన్నారంటే, అది కేవలం నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని షా వ్యాఖ్యానించారు. ఎందుకంటే, తమ ప్రభుత్వం హయాంలో జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశామని, ఉగ్రవాదం కూడా చివరి దశలో ఉందని, నక్సలిజం నేడు అంతిమ దశకు చేరుకుందని షా పేర్కొన్నారు. కాబట్టి, రాబోయే ఎన్నికల్లో తమను గెలిపిస్తే రెండేళ్లలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల వ్యాపారాన్ని సమూలంగా నిర్మూలిస్తామని షా హామీ ఇచ్చారు.

ఎన్డీయేతో పొత్తు ప్రసక్తే లేదు

- టీవీకే చీఫ్ విజయ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, మార్చి 14: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ముఖ్యంగా దళపతి విజయ్ నేతృత్వంలోని తమిగళ వెట్రి కజగంపైనే అందరి దృష్టి నెలకొంది. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్‌డీఏతో పొత్తు ఉంటుందని వార్తలు వస్తోన్న ఈ క్రమంలో విజయ్ పార్టీ క్లారిటీ ఇచ్చింది. ఎన్‌డీఏ కూటమితో పొత్తుకు ఎటువంటి ఆస్కారం లేదని స్పష్టం చేసింది. ఈ విషయమై జరుగుతున్న చర్చలు కేవలం ఊహాగానాలు మాత్రమే అని కొట్టిపారేసింది. టీవీకే జిల్లా కార్యదర్శులతో జరిగిన వర్చువల్ సమావేశంలో పార్టీ బలాబలాలు సహా పొత్తులపై చర్చ జరిగిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్ తెలిపారు. ఎన్‌డీఏతో పొత్తుకు అవకాశమే లేదన్న ఆయన సిద్ధాంతాల పరంగా బీజేపీ తమకు శత్రువని పేర్కొన్నారు. ఎన్నికల్లో పొత్తు పెట్టుకొని పోటీ చేస్తే విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయని జిల్లా కార్యాదర్శులు, టీవీకే ప్రధాన కార్యదర్శికి తెలియజేసినట్లు తెలిసింది. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ, పార్టీ సభ్యులు అధికారిక ప్రకటనలనే నమ్మాలని కోరారు. అటు టీవీకేతో పొత్తు గురించి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్‌ను ప్రశ్నించగా, ఆయన సూటిగా సమాధానం ఇవ్వలేదు. మీరు కూటమి గురించి ఆలోచిస్తున్నారని, తను మాత్రం తమిళనాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే దృష్టి ఉందని చెప్పారు. ముఖ్యంగా చట్టవ్యవస్థ వైఫల్యం, మహిళల భద్రతపై ఆందోళన చెందుతున్నాని అన్నారు.



భారత 94వ గ్రాండ్‌మాస్టర్ మయాంక్ చక్రవర్తి

భారత యువ చెస్ ఆటగాడు మయాంక్ చక్రవర్తి చరిత్ర సృష్టించాడు. అసోంకు చెందిన 17 ఏండ్ల మయాంక్ భారత 94వ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచి, ఈశాన్య రాష్ట్రాల నుంచి ఈ ఘనత సాధించిన తొలి చెస్ ప్లేయర్‌గా రికార్డులకెక్కాడు. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో జరిగిన చెస్ టాలెంట్స్ టోర్నమెంట్‌ను కైవసం చేసుకోవడంతో అతడికి జీఎం హోదా దక్కింది. జీఎంగా అర్హత సాధించడానికి గాను ఈ టోర్నీలో 6.5 పాయింట్లు సాధించాల్సి ఉండగా మయాంక్ ఏకంగా 7 పాయింట్లతో సత్తాచాటి టైటిల్‌తో పాటు జీఎం హోదానూ సాధించాడు.

హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ

ఫైనల్లో తడబడి రన్నరప్ గా నిలిచిన భారత్

ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ ఆసాంతం అపజయమెరుగని ఆటతో అదరగొట్టిన భారత మహిళల జట్టు ఫైనల్‌లో తడబడింది. నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తుది పోరులో భారత్.. 02తో ఇంగ్లండ్ చేతిలో అపజయం పాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది. లీగ్‌తో పాటు కీలక నాకౌట్ దశలోనూ సత్తాచాటిన భారత అమ్మాయిలు.. కీలక ఫైనల్ పోరులో మాత్రం ప్రపంచ ఆరో ర్యాంకు జైట్టెన ఇంగ్లండ్ ఆట ముందు తేలిపోయి రజతంతో సంతృప్తి పడ్డారు. ఇంగ్లండ్ తరఫున తొలి క్వార్టర్‌లోనే గ్రేస్ బల్స్‌డన్ గోల్ కొట్టగా మూడో క్వార్టర్‌లో నీల్ ఎలిజిబెత్ రెండో గోల్ సాధించింది. నాలుగు క్వార్టర్స్‌లోనూ భారత జట్టుకు నాలుగుసార్లు పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్ కొట్టే అవకాశమొచ్చినా మన అమ్మాయిలు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్.. 10తో ఇటలీని చిత్తుచేసి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ ఏడాది ఆగస్టు 1530 మధ్య బెల్జియం, నెదర్లాండ్స్ ఆతిథ్యమివ్వనున్న హాకీ ప్రపంచకప్‌నకు ఈ టోర్నీలో టాప్ 3లో నిలిచిన జట్లు (ఇంగ్లండ్, భారత్, స్కాట్లాండ్) అర్హత సాధించాయి. టోర్నీలో ఇప్పటికే ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న భారత్.. టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగింది. కానీ ఫైనల్‌లో మాత్రం పటిష్ట ఇంగ్లండ్ సమష్టి ఆట ముందు భారత్ తేలిపోయింది. రెండో నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ అవకాశం దక్కినా నవ్‌నీత్ కౌర్ దానిని గోల్‌గా మలుచలేకపోయింది. తొలి క్వార్టర్ ముగింపు దశకు చేరుకుంటున్న సమయంలో దక్కిన పీసీని ఇంగ్లండ్ చక్కగా వినియోగించుకుని గోల్ చేసింది. ఆట అర్ధభాగం ముగిసే సరికే 10 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్.. భారత ఎదురుదాడిని నిలువరిస్తూనే 43వ నిమిషంలో రెండో గోల్‌తో ఆధిక్యాన్ని 20కు పెంచుకుంది. పటిష్టమైన ఇంగ్లండ్ డిఫెన్స్‌ను ఛేదించలేక ఆఖరి క్వార్టర్‌లోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. టోర్నీలో నాలుగు గోల్స్ చేసిన నవ్‌నీత్ కౌర్‌కు బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు లభించింది.

ముగ్గురికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్

- బిన్నీ, ద్రవిడ్, మిథాలీకి పురస్కారాలు
- బెస్ట్ క్రికెటర్‌గా గిల్, మంధాన

ప్రతి యేటా అందజేసే 'నమన్' అవార్డులను బీసీసీఐ శనివారం ప్రకటించింది. భారత క్రికెట్ కు ఎనలేని సేవలు చేసిన దిగ్గజ క్రికెటర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్ (కల్నల్ సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్), మిథాలీ రాజ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించనుంది. నిరుడు భారత మెన్స్ టెస్ట్, వన్డే జట్టు పగ్గాలు అందుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు 202425 ఏడాదికి గాను బెస్ట్ ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా పాలి ఉమ్రిగర్ అవార్డు దక్కగా అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన ఎంపికైంది. తెలుగమ్మాయి శ్రీచరణి బెస్ట్ ఇంటర్నేషనల్ డెబ్యూ క్రికెటర్ అవార్డుకు ఎంపికవగా పురుషుల విభాగంలో ఈ అవార్డు హర్షిత్ రాణాను వరించింది. ఈ అవార్డులతో పాటు ఇటీవల ఐసీసీ ట్రోఫీలు గెలిచిన (2025లో చాంపియన్స్ ట్రోఫీ, మహిళల వన్డే ప్రపంచకప్ 2025, ఉమెన్స్ అండర్ 19 టీ20 వరల్డ్ కప్, మెన్స్ అండర్ 19 క్రికెట్ వరల్డ్ కప్, మెన్స్ టీ20 వరల్డ్ కప్ 2025) విజేతలను కూడా ఈ సందర్భంగా బీసీసీఐ ఘనంగా సత్కరించనుంది.

సబలెంకా వర్సెస్ రిబాకినా

- టైటిల్ పోరుకు సై సెమీస్‌లోనే ఓడిన బాంబ్రీ జోడీ

ఈ ఏడాది టెన్నిస్ ఆరంభ సీజన్ టోర్నీ అయిన ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఫైనల్‌లో ఢీకొన్న అరీనా సబలెంకా (బెలారస్), ఎలీనా రిబాకినా (కజకిస్థాన్) మరోసారి టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ ఇద్దరూ బీఎన్‌పీ పారిబాస్ ఓపెన్ (ఇండియన్ వెల్స్) టోర్నీలో ఫైనల్‌కు చేరారు. మహిళల సింగిల్స్ సెమీస్‌లో టాప్ సీడ్ సబలెంకా.. 63, 64తో లిండా నొస్కొవ (చెక్)పై సునాయస విజయం సాధించింది. గడిచిన నాలుగేండ్లలో ఆమెకు ఇది మూడో ఫైనల్ కావడం విశేషం. రెండో సెమీస్‌లో రిబాకినా.. 75, 64తో స్విటోలినా (ఉక్రెయిన్)ను చిత్తుచేసి సబలెంకాతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌లో ఈ ఇద్దరి మధ్య జరిగిన ఫైనల్‌లో రిబాకినానే అదృష్టం వరించిన విషయం తెలిసిందే. కాగా పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ జోడీ పోరాటం సెమీస్‌కే పరిమితమైంది. తొలిసారి ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీలో సెమీస్‌కు చేరిన బాంబ్రీ, గొరన్సన్ (స్వీడన్) జోడీ.. 57, 76 (7/3) 510తో ఆర్థర్ రిండర్‌నెక్ (ఫ్రాన్స్), వాలెంటిన్ (మొనాకో) చేతిలో ఓడింది.

కొరియాలో కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి. లావిష్ బడ్జెట్ తో రూపొందించబడిన ఈ చిత్రం హర్రర్, కామెడీని రిఫ్రెషింగ్ క్రాస్‌కల్చరల్ ట్విస్ట్‌తో బ్లెండ్ తో తెరకెక్కుతోంది. ఇండియన్, కొరియన్ నేపథ్యాలలో రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇంతకు ముందు ఎన్నడూలేని భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. టీం ఇప్పుడు ఫైనల్ షూటింగ్ షెడ్యూల్ సౌత్ కొరియాలో ప్రారంభించింది. కీలకమైన ఒక వారం రోజుల షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్‌లో పాటలు, కథలో ముఖ్యమైన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య పాల్గొనున్న ఈ షెడ్యూల్ ను కొరియాలోని అద్భుతమైన ప్రదేశాల్లో చిత్రీకరించనున్నారు. వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'కొరియన్ కనకరాజు' టైటిల్ గ్లింప్స్ ఇప్పటికే అద్భుతమైన స్పందనను అందుకుంది. స్టైలిష్ ప్రెజెంటేషన్, ఎంటర్టైనింగ్ టోన్‌తో వచ్చిన గ్లింప్స్ సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. ఆ వీడియో ఈ చిత్రంలో ఉండే హిలేరియస్ హారర్‌కామెడీ వరల్డ్ ని పరిచయం చేసింది.

బంగారు బొమ్మ..

'గోదారి గట్టుపైన' నుంచి మ్యాజికల్ మెలోడీ రిలీజ్

యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన' తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. టీజర్, ఫస్ట్ రెండు సింగిల్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది ఈ జోష్ ని కొనసాగిస్తూ, మేకర్స్ ఇప్పుడు మూడో సింగిల్ 'బంగారు బొమ్మ'ను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు నాగ వంశీ సాఫ్ట్ బీట్స్, సాఫ్ట్ స్ట్రింగ్స్, హృదయాన్ని హత్తుకునే ఆర్కెస్ట్రేషన్‌తో వింటేజ్ మ్యాజిక్‌ను ఇచ్చారు. వింటేజ్ మాధుర్యాన్ని గుర్తు చేసే ఈ సాంగ్ స్వచ్ఛమైన అనుభూతిని అందిస్తుంది. లిరిక్ రైటర్ బాలాజీ రాసిన సాహిత్యం హీరో ఫీలింగ్స్ ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. హీరోయిన్ ని ప్రేమగా "బంగారు బొమ్మ" అని పిలుస్తూ, ఆమెను చూసినా, ఆమె గురించి ఆలోచించినా తనకు అశాంతి కలుగుతుందని చెప్పడం అలరిస్తోంది. ప్రేమలో పూర్తిగా మునిగిపోయిన మనసును ఈ పాట అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. పాట మొత్తం సాఫ్ట్, రొమాంటిక్, ఫన్ ఎక్స్ ప్రెషన్ తో సాగుతుంది. హీరోయిన్ కనిపించే ప్రతి క్షణంలో కలిగే ఎమోషన్స్, గుండెల్లో తేలే భావనలు, మిగిలిపోయే జ్ఞాపకాలు.. అన్ని కలిపి యూత్ లవ్ ని గుర్తు చేసే డ్రీమీ మూడ్‌ను సృష్టిస్తాయి. ఈ పాటకు అసలైన ప్రాణం లెజెండరీ గాయకులు ఎస్.పీ. చరణ్, కె.ఎస్. చిత్ర అందించిన మధుర వోకల్స్. వారి హార్మనీ పాటకు గొప్ప మాధుర్యాన్ని, భావోద్వేగాలని జోడిస్తుంది.

ఉస్తాద్ భగత్ సింగ్

పవర్‌ఫుల్ ట్రైలర్ విడుదల

'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. భారీ అంచనాల నడుమ అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' ట్రైలర్‌ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. పవర్, యాక్షన్, వినోదంతో నిండిన పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌ను ట్రైలర్ వాగ్దానం చేస్తోంది. ట్రైలర్‌లో పవన్ కళ్యాణ్ టాప్ ఫామ్‌లో కనిపిస్తూ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ట్రైలర్ అంతటా తన ట్రేడ్‌మార్క్ కరిష్మాను ప్రదర్శించారు. పంచ్ డైలాగులు, హై వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, వినోదభరితమైన క్షణాలు.. ప్రతి అంశం ప్రభావవంతంగా నిలిచి సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది. దర్శకుడు హరీష్ శంకర్ మరోసారి మాస్ ఎంటర్‌టైనర్‌లను తెరకెక్కించడంలో తన ప్రత్యేకతను చాటుకున్నారు. వెండితెరపై అభిమానులు చూడాలనుకునే విధంగా పవన్ కళ్యాణ్‌ను అద్భుతంగా ప్రజెంట్ చేయడంలో తన సత్తా నిరూపించుకున్నారు. ట్రైలర్ కట్ చాలా షార్ప్‌గా, ఆకర్షణీయంగా ఉంది. థియేటర్లలో అభిమానులు, సినీ ప్రియులకు ఈ చిత్రం పూర్తి స్థాయి వినోద విందును అందించబోతుందనే నమ్మకాన్ని ట్రైలర్ కలిగించింది. రోజు రోజుకీ సినిమాపై ఆసక్తి, అంచనాలు పెరుగుతున్న నేపథ్యంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం వెండితెరపై గుర్తుండిపోయే సినీ అనుభవాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200